# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 138 | విశాఖపట్నం | 18-2-2026 బుధవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue :138 | VISAKHAPATNAM | 18-2-2026 WEDNESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇన్‌చార్జ్: డి. లావణ్య

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902




4లో

**శాసనమండలిలో ఎందుకు డిజిటల్ అటెండెన్స్ వ్యవస్థను అమలు చేయలేదు?: బొత్స**



6లో

**వెన్ను నొప్పితో బాధపడుతున్నారా...?**



2లో

**ఫ్రాన్స్ సహాయంతో ఎవరెస్టుపైకి వెళ్లగలిగే హెలికాప్టర్‌ను తయారు చేస్తాం: మోడీ**




# చంద్రన్న బీమా ఎప్పుడిస్తారు?

**(అమరావతి, పతాకం న్యూస్)**

తాము అధికారంలోకి వస్తే కార్మికులకు రూ.10 లక్షల బీమా వర్తింప చేస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇంత వరకు ఆచరణకు నోచుకోలేదు. అంతేగాక ప్రతి ఏటా కార్మిక శాఖ ద్వారా అమలు చేయాల్సిన పలు సంక్షేమ పథకాలు ఏడాదిన్నరగా నిలిచిపోయాయి. 2019 నుంచి 2024 వరకు వైసిపి ప్రభుత్వం వ్యవహరించిన తీరులోనే కూటమి ప్రభుత్వం కూడా వ్యవహరిస్తోంది. తాము అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నందున కార్మిక శాఖ నుంచి ఎటువంటి సంక్షేమ పథకాలు ఇవ్వనవసరం లేదని వైసిపి ప్రభుత్వం జారీ చేసిన జీవో 1214 ఇప్పటికీ అమలవుతుండటమే దీనికి నిదర్శనం. . కార్మిక సంక్షేమ బోర్డుకు లేబర్ సెస్సు రూపంలో వసూలు చేస్తున్న నిధులు చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటి నుండి రూ.4 వేల కోట్ల వరకు ప్రభుత్వ ఖాతాలో నిల్వ ఉన్నాయి. ఈ నిధులను ప్రభుత్వం ఇతర అవసరాలకు వినియోగించుకోవాలన్న యోచనలో ఉందని, కార్మికులకు సంబంధించిన సంక్షేమ, బీమా పథకాలకు ఏమాత్రం నిధులు కేటాయించడం లేదని కార్మిక సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో అసంఘటిత కార్మికులకు ఏడాదిన్నరగా బీమా పరిహారం చెల్లింపులు నిలిచిపోయాయి. దాదాపు లక్ష వరకు క్లయిమ్‌లు కార్మిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 9,078 క్లయింలు పెండింగ్‌లో ఉన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. ప్రధానంగా బీమా దరఖాస్తులతో పాటు కార్మికుల పిల్లలకు వివాహ భృతి, డెలివరీ ఖర్చులు, రోడ్డు ప్రమాదంలో మృతి చెందితే పరిహారం, వికలాంగులుగా మారితే పరిహారం, కార్మికుల సాధారణ మరణ భృతి, అనారోగ్యానికి గురైతే రావాల్సిన వైద్య ఖర్చులు, కార్మికుడి మృతి చెందితే మట్టిఖర్చులు, నైపుణ్య శిక్షణ భృతి, కార్మికుల పిల్లలకు స్కాలర్ షిప్‌ల పథకాలన్నీ గత ఆరున్నర ఏళ్లుగా నిలిచిపోయాయి.

ఈ పథకాలతో పాటు 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మిక శాఖ నుంచి వివిధ రంగాలకు చెందిన అసంఘటిత రంగ కార్మికులు ప్రమాదాలకు గురైతై వారి కుటుంబ సభ్యులకు ఎటువంటి బీమా చెల్లింపులు జరగడం లేదు. ఈ అంశంపై ఇంత వరకు ఉన్నత స్థాయిలో విధానపరమైన నిర్ణయం ఇంకా తీసుకోలేదని క్షేత్ర స్థాయి అధికారులు చెబుతున్నారు. గత ఏడాది చంద్రన్న బీమా అమలుకు సంబంధించి కొన్ని బీమా కంపెనీలతో కార్మిక శాఖ ఉన్నతాధికారులు చర్చలు జరిపారు. కార్మికుల తరుపున ప్రీమియం ఎంత చెల్లించాలన్న అంశంపై చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. ఈ తరువాత మళ్లీ ఇంత వరకు ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం రాకపోవడంతో కార్మిక శాఖ ఉన్నతాధికారులు కూడా ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఉండిపోయారు. ప్రధానంగా ప్రమాద బీమా గరిష్ట పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడం, కుటుంబంలో ఎంత మంది సభ్యులు ఉంటే వారిలో ఎవరు ప్రమాదానికి గురై మరణించినా బీమా పరిహారం చెల్లించాలని ఒక దశలో ఉన్నతాధికారులు ప్రతిపాదించినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. 2014 నుంచి 2018మధ్య కాలంలో టిడిపి ప్రభుత్వం చంద్రన్న బీమా పథకం కింద కార్మికుడి కుటుంబంలో సంపాదించే వ్యక్తి ప్రమాదానికి గురై మరణిస్తేనే తాము గరిష్టంగా రూ.5 లక్షలు చెల్లించారు. బీమా గరిష్ట పరిమితిని రూ.10 లక్షలకు పెంచుతామని సిఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచార సభల్లో ప్రకటించారు. కానీ ఇంత వరకు ఎటువంటి మార్గదర్శకాలు రాకపోవడంతో కార్మికులకు చెల్లింపులు నిలిచిపోయాయి.

రాష్ట్రంలో 80 లక్షల మంది అసంఘటిత రంగకార్మికులు ఉన్నారని, మొత్తం మూడు కోట్ల మంది సభ్యులు బీమాకు అర్హులుగా ఉన్నా ఇంత వరకు ఇందుకు సంబంధించిన విధి విధానాలు రాలేదని అధికారులు తెలిపారు. గతంలో కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు అమలు చేసిన అన్ని సంక్షేమ పథకాలను ప్రభుత్వం నిలిపివేసింది. కార్మికుల పిల్లలకు వివాహ కానుక, కార్మికుల పిల్లల డెలివరికీ రెండు కాన్పుల వరకు రూ.20 చొప్పున ఆర్థిక సాయం, కార్మికుడు చనిపోతే రూ.20 వేలు మట్టిఖర్చులు చెల్లింపులు జరగడం లేదు.

## రూ.1000 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు: లోకేశ్

**అమరావతి, పతాకం న్యూస్:** గత ప్రభుత్వం 2019-24 సమయంలో జీవో 117 తీసుకురావడంతో పేద పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారని, ఈ క్రమంలో ఎన్నికల సమయంలో తాము ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ప్రజా ప్రభుత్వం వచ్చాక ఆ జీవోను రద్దు చేశామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేశ్ సమాధానమిస్తూ, గత ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం చేపట్టిన తర్వాత కూడా 233 పాఠ శాలలు మూసివేసే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. అంతేకాకుండా పాఠశాల విద్యాభివృద్ధిలో వన్ క్లాస్ - వన్ టీచర్ విధానం చాలా కీలకమైందని, గతంలో 3 శాతం పాఠశాలల్లో మాత్రమే వన్ క్లాస్ - వన్ టీచర్ ఉంటే, (తరువాయి 4వ పేజీలో)





**భారత్‌లో డ్రోన్ల విప్లవం..**

**38 వేలు దాటిన రిజిస్ట్రేషన్లు**

2లో

## విశాఖలో రాష్ట్రపతి ముర్ముకు స్వాగతం పలికిన గవర్నర్ నజీర్, పవన్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం సాయంత్రం విశాఖపట్నం చేరుకున్నారు. నగరంలోని ఐఎన్ఎస్ డేగా నౌకాదళ విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో వచ్చిన ఆమెకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి సాదరంగా స్వాగతం పలికారు. ఎంపీ శ్రీభరత్, మేయర్ పీలా శ్రీనివాస్, ఉన్నతాధికారులు కూడా రాష్ట్రపతిని ఆహ్వానించిన వారిలో ఉన్నారు. మంగళవారం విశాఖ తీరంలో జరగనున్న ప్రతిష్మాత్మక 'అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష-2026'కు రాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. భారత సాయుధ దళాల సుప్రీం కమాండర్‌గా ఆమె ఈ సమీక్షను పర్యవేక్షిస్తారు. ఈ కార్యక్రమంలో భారత నౌకాదళంతో పాటు పలు విదేశీ యుద్ధనౌకలు కూడా పాల్గొంటాయి.

## వైసీపీ నాయకులపై అచ్చెన్నాయుడు ఫైర్

**అమరావతి, పతాకం న్యూస్:** తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో వైసీపీ నేతలపై ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ.. లడ్డూలో కల్తీ జరిగిందని నాటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డే స్వయంగా ఒప్పుకున్నాక కూడా, వైసీపీ నేతలు సిగ్గు లేకుండా ఎదురుదాడి చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. "తప్పు ఒప్పుకున్నాక కూడా బుకాయిస్తారా? వైసీపీ నేతల్లారా సిగ్గుపడండి" అని అచ్చెన్నాయుడు వ్యాఖ్యా నించారు. కోట్ల మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసి, పవిత్ర ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వైసీపీకి ధర్మం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు. ఈ సందర్భంగా గతంలో జగన్ తిరుమల పర్యటనను మంత్రి గుర్తుచేశారు. హిందూ సంప్రదాయాల ప్రకారం డిక్లరేషన్ ఇవ్వడానికి జగన్ ఎందుకు భయపడ్డారని ప్రశ్నించారు.



పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

## అతీతుడా?

ప్రధానమంత్రి పేరుతో నడుస్తున్న మూడు కేంద్ర నిధులపై పార్లమెంట్‌లో ప్రశ్నలు అనుమతించకూడదంటూ పిఎంవో ఇటీవల జారీ చేసిన ఆదేశాలను కేవలం పాలనాపరమైన నిర్ణయంగా మాత్రమే చూడటం సరికాదు. ఈ ఆదేశాలను ప్రజాస్వామ్య సూత్రాలపై నేరుగా చేసిన దాడిగానే పరిగణించాలి. ప్రజల నుంచి వివిధ రూపాల్లో సేకరించిన ప్రతి రూపాయిని ఎలా ఖర్చు చేస్తున్నారో తెలుసుకోవడం ప్రజల హక్కు. రాజ్యాంగం ద్వారా ప్రజలకు దఖలు పడిన ఆ హక్కుకు పార్లమెంటే పూచీ! అటువంటిది పార్లమెంటులోనే ఆ ప్రశ్నలకు ఆస్కారం లేకుండా చేయడమంటే ప్రజల కళ్లకు గంతలు కట్టడమే! ప్రజాస్వామ్యమన్నా, రాజ్యాంగమన్నా బిజెపికి, దానిని వెనుకనుండి నడిపించే సంఘ్ పరివార్ శక్తులకు ఏమాత్రం గౌరవం లేదన్న విషయాన్ని తాజా పరిణామం మరోసారి దేశ ప్రజల ముందు స్పష్టం చేస్తోంది. ప్రధానమంత్రి పదవిలో ఎవరున్నా వారు ప్రజలకు, పార్లమెంటుకు బాధ్యత వహించాలని, జవాబుదారీగా ఉండాలని రాజ్యాంగం నిర్దేశిస్తోంది. కానీ, తాజా ఆదేశం ద్వారా ప్రజలకు జవాబు చెప్పాల్సిన బాధ్యతకు ప్రధాని నరేంద్ర మోడీ అతీతుడన్న సందేశాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఇస్తోందనిపిస్తోంది. కోవిడ్ వంటి అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి 2020లో ఏర్పాటు చేసిన పిఎం కేర్స్ నిధి, ప్రకృతి విపత్తులు, అల్లర్ల బాధితులకు సాయం అందించడానికి 1946లో స్థాపించిన ప్రధానమంత్రి జాతీయ ఉపశమన నిధి, సైన్యంతో పాటు దేశ రక్షణ చర్యల్లో పాల్గొనే ఇతర దళాల సభ్యులు, వారి కుటుంబాలకు ఆపత్సమయంలో సహాయం చేయడంకోసం ఏర్పాటు చేసిన జాతీయ రక్షణ నిధులు తాజా వివాదంలో కేంద్ర బిందువులుగా మారాయి. ఈ మూడు నిధులకు సంబంధించిన ప్రశ్నలను అనుమతించకూడదని ప్రధానమంత్రి కార్యాలయం లోక్‌సభ కార్యదర్శికి సూచించింది. లోక్‌సభ కార్యనిర్వహణ నియమావళిలోని 41(2)(8), 41(2)(17) నిబంధనలను ఉటంకిస్తూ పిఎం కార్యాలయం జారీ చేసిన ఈ ఆదేశాలు ప్రస్తుతం చర్చనీయాంశాలుగా మారాయి. ప్రభుత్వంతో ప్రత్యక్ష సంబంధం లేని, ప్రభుత్వానికి ప్రాథమిక బాధ్యత లేని వ్యక్తులు, సంస్థల గురించి ప్రశ్నలు అనుమతించకూడదని సూచించే నిబంధనలు అవి! అదే విధంగా ఈ నిధులు భారత కన్సాలిడేటెడ్ ఫండ్‌లోకి రావని కూడా ప్రధానమంత్రి కార్యాలయం పేర్కొంది. ఇవన్నీ ప్రజా విరాళాలతో నడిచే నిధులు. ఇవి 'కన్సాలిడేటెడ్ ఫండ్'లో భాగం కావని చెప్పడం ద్వారా పారదర్శకత నుంచి తప్పించుకోవచ్చని భావించడం బాధ్యతారాహిత్యం. నిధి ప్రభుత్వ ఖజానాలో ఉందా లేదా అన్నది ప్రధాన విషయం కాదు. ప్రజా ప్రయోజనాల కోసం సేకరించిన నిధి అయితే దాని వినియోగంపై ప్రశ్నించే హక్కు ప్రజలకు, వారు ఎన్నుకున్న ప్రతినిధులకు ఉందన్నది నిర్వివాదాంశం. ఇక్కడ మరో అంశం కూడా ఉంది. పార్లమెంట్‌లో ప్రశ్నను అనుమతించాలా, వద్దా అన్నది నిర్ణయించాల్సింది స్పీకర్ మాత్రమే. అంటే, పార్లమెంటుకు మాత్రమే ఆ అధికారం ఉందని అర్థం. ప్రధానమంత్రి కార్యాలయానికి ఈ వ్యవహారంలో ఎటువంటి ప్రమేయమూ లేదు. అత్యంత కీలకమైన ఆ ప్రాథమిక రాజ్యాంగ సూత్రాన్నే తాజా వ్యవహారంలో పిఎం కార్యాలయం విస్మరించడాన్ని అంత తేలికగా తీసుకోవడానికి వీలు లేదు. కేవలం నిధుల దుర్వినియోగంపై సమాచారం బయటకు వస్తుందన్న ఆందోళన ఒక్కటే ప్రశ్నలను అడ్డుకోవడానికి కారణమని భావించలేం. పార్లమెంటుకు ప్రధానిని అతీతునిగా చూపించే ప్రణాళిక కూడా దీనిలో ఉందన్న అభిప్రాయం వ్యక్తమౌతోంది. పార్లమెంటు అధికారాన్ని తగ్గించే ప్రయత్నం చేయడం బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వానికి ఇదే మొదటిసారి కాదు. ప్రజాస్వామ్య దేవాలయమంటూ సాష్టాంగ ప్రణామం చేసి పార్లమెంటులోకి ప్రవేశించినప్పటి నుండి నరేంద్ర మోడీ సర్కారుది ఇదే ధోరణి. తాజా ఆదేశాలు, రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మాన చర్చకు సమాధానం ఇవ్వడానికి లోక్‌సభకు హాజరు కాకపోవడం దీనికి పరాకాష్ట. ప్రజాస్వామ్యంలో ప్రశ్నలే కీలకం. ఆ ప్రశ్నను అడ్డుకోవడమంటే ప్రజాస్వామ్య గొంతు నులమడమే! మోడీ సర్కారు విసిరిన ఈ సవాల్‌ను ఎదుర్కోవడమే ప్రజాస్వామ్య వాదుల, దేశ భక్తుల ప్రస్తుత కర్తవ్యం.

## విద్యా వ్యవస్థలో కీలక మార్పులు తీసుకురావాలి: నాగబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** విద్యార్థుల్లో పెరుగుతున్న మానసిక ఒత్తిడిని తగ్గించి, వారిని శారీరకంగా దృఢంగా తీర్చిదిద్దేందుకు విద్యా వ్యవస్థలో కీలక మార్పులు తీసుకురావాలని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కోన నాగబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో ఆయన మాట్లాడుతూ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థుల కోసం 'కామన్ ప్లే గ్రౌండ్ సిస్టమ్ (సీజీపీఎస్)' అనే వినూత్న విధానాన్ని ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. ఆటస్థలాలు లేక నాలుగు గోడల మధ్యే చదువుకు అంకితమవుతున్న విద్యార్థుల శ్రేయస్సు కోసం ఈ చర్యలు అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ, "పిల్లల్లో ఉండే అపారమైన శక్తిని సరైన మార్గంలోకి మళ్లిస్తే వారు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారు. వారంలో కనీసం మూడు రోజులైనా వారికి ఫిజికల్ ఫిట్‌నెస్, ఆటలు, ఇతర సహ పాఠ్యాంశ కార్యకలాపాల్లో శిక్షణ ఇవ్వాలి. ముఖ్యంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివే పిల్లలు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. దీనివల్ల మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఒత్తిడి తట్టుకోలేక కొందరు ఆత్మహత్యలకు పాల్పడిన విషాద సంఘటనలు కూడా ఉన్నాయి. ఆటలు ఆడటం వలన ఈ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా ప్రైవేట్ విద్యాసంస్థలకు సొంతంగా ఆటస్థలాలు లేవని, ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం విశాలమైన మైదానాలు అందుబాటులో ఉన్నాయని నాగబాబు గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో "కామన్ ప్లే గ్రౌండ్ సిస్టమ్"ను అమలు చేయాలని సూచించారు. ఈ విధానం ద్వారా జిల్లా పరిషత్, మునిసిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లోని మైదానాలను ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు కూడా ఉపయోగించుకోవచ్చని వివరించారు. దీనికోసం ప్రైవేట్ యాజమాన్యాల నుంచి కనీస రుసుము వసూలు చేయాలని, ఆ మొత్తాన్ని సంబంధిత ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య సిబ్బంది నియామకం, మైదానాల నిర్వహణకు వినియోగించాలని సూచించారు. దీనివల్ల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల మధ్య సత్సంబంధాలు, అవగాహన కూడా పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. శారీరక దృఢత్వం ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లను ఆయన ఆదర్శంగా చూపారు. "70 ఏళ్ల వయసులో కూడా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఎంతో చురుకుగా ఉన్నారు. ప్రతిరోజూ యోగా చేస్తూ ఉత్సాహంగా పరిపాలన సాగిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారు కీలక శాఖల బాధ్యతలు నిర్వర్తిస్తూనే మార్షల్ ఆర్ట్స్ సాధన కొనసాగిస్తున్నారు. ఇటీవల 'టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్' అనే అంతర్జాతీయ బిరుదు కూడా పొందారు" అని నాగబాబు ప్రశంసించారు. "ఇనుప కండరాలు, ఉక్కు నరాలు కలిగిన యువత ఈ దేశానికి కావాలి" అన్న స్వామి వివేకానంద మాటలను ఉటంకిస్తూ, మన విద్యార్థులను కేవలం పుస్తకాల పురుగులుగా కాకుండా శారీరకంగా, మానసికంగా బలమైన యువతగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. చదువుతో పాటు ఫిజికల్ ఫిట్‌నెస్, మార్షల్ ఆర్ట్స్, సెల్ఫ్ డిఫెన్స్, యోగా వంటివి పాఠ్యాంశాల్లో భాగం చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ లను సభ ద్వారా కోరుతున్నానని చెబుతూ నాగబాబు తన ప్రసంగాన్ని ముగించారు.

## త్వరలో విజయవాడ రైల్వేస్టేషన్ మోడ్రనైజేషన్ పూర్తి: ఎంపీ కేశినేని శివనాథ్



**విజయవాడ, పతాకం న్యూస్:** విజయవాడ రైల్వే ప్రాజెక్టుల నిర్మాణం, పురోగతి అంశాలపై రైల్వే డీఆర్ఎంతో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మంగళవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో వివిధ రైల్వే ప్రాజెక్టుల పనితీరు, కేంద్రం - రాష్ట్ర ప్రభుత్వాల సహకారం వంటి అనేక అంశాలను ఎంపీకి డీఆర్ఎం వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ.. రైల్వే ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చేలా కృషి చేసిన రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు ఢిల్లీ వెళ్లినప్పుడల్లా ఏపీకి రైల్వేలు, అమరావతి రైల్వే స్టేషన్, కొత్త రైల్వే లైన్లు ఈ బడ్జెట్‌లో ఉండేలా కృషి చేశారని తెలిపారు. విజయవాడ నగరంలోని పలు సమస్యలపై డీఆర్ఎంతో సుదీర్ఘంగా చర్చించినట్లు ఎంపీ తెలిపారు. విజయవాడ రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు సంబంధించి పార్లమెంట్‌లో తాము ప్రస్తావించగానే రైల్వే మంత్రి వెంటనే ప్రక్రియ ప్రారంభించారని తెలిపారు. నీతి ఆయోగ్ నుంచి అనుమతి వచ్చిందని, ప్రీ-బిడ్ మీటింగ్‌లు కూడా జరిగాయని ఎంపీ వెల్లడించారు. భారతదేశంలోనే అత్యంత రద్దీగా, అతిపెద్ద రైల్వే స్టేషన్లలో ఒకటైన విజయవాడ స్టేషన్ మోడ్రనైజేషన్ పూర్తి అయితే.. అమృత్ భారత్ రైల్వే స్టేషన్లను మించి ఆధునిక రూపం సంతరించుకుంటుందని ఎంపీ ఆశాభావం వ్యక్తం చేశారు. పీపీపీ మోడల్‌లో విజయవాడ రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయబోతున్నారని తెలిపారు. అతి త్వరలోనే రాయనపాడు రైల్వే స్టేషన్.. అమృత్ భారత్ స్టేషన్‌గా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కాబోతోందని వెల్లడించారు. గుణదల రైల్వే స్టేషన్ కూడా అమృత్ భారత్ స్టేషన్ కింద ప్రారంభం అవుతుందని ఎంపీ ప్రకటించారు. ఎన్టీఆర్ జిల్లాలో మిగిలిన ఏకైక స్టేషన్ కొండపల్లి అని.. దీనికి కూడా అమృత్ భారత్ కింద అప్లై చేసి, అమృత్ భారత్ 2.0 సెకండ్ ఫేజ్ కింద తీసుకురాబోతున్నామని చెప్పారు. కొండపల్లి రైల్వే స్టేషన్‌లో రెండు ప్లాట్‌ఫామ్‌ల అభివృద్ధికి సుమారు రూ.10 కోట్లు మంజూరు చేసినట్లు ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడించారు.

## భారత్‌లో డ్రోన్ల విప్లవం..
## 38 వేలు దాటిన రిజిస్ట్రేషన్లు




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** భారతదేశంలో డ్రోన్ రంగం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. దేశవ్యాప్తంగా రిజిస్టర్ అయిన డ్రోన్ల సంఖ్య 38,500 మార్కును దాటింది. అదే సమయంలో, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నుంచి ధృవీకరణ పొందిన రిమోట్ పైలట్ల సంఖ్య 39,890కి చేరినట్లు మంగళవారం విడుదలైన అధికారిక గణాంకాలు స్పష్టం చేశాయి. దేశంలో డ్రోన్ల వినియోగం పెరగడానికి తయారీదారులు, సాఫ్ట్‌వేర్ డెవలపర్లు, సర్వీస్ ప్రొవైడర్లు, శిక్షణా సంస్థలతో కూడిన ఒక సమగ్ర వ్యవస్థ అభివృద్ధి చెందడమే కారణమని ప్రభుత్వ ప్రకటన పేర్కొంది. డ్రోన్ల ఆపరేటింగ్, నిర్వహణ కోసం నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించేందుకు 240కి పైగా శిక్షణా సంస్థలు కూడా ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ ప్రగతిశీల విధానాలు, ఆర్థిక ప్రోత్సాహకాలతో ఈ రంగం కేవలం పైలట్ ప్రాజెక్టుల నుంచి ప్రధాన స్రవంతిలోకి మారింది. వ్యవసాయం, భూమి సర్వేలు, మౌలిక సదుపాయాల పర్యవేక్షణ, విపత్తుల అంచనా, ప్రభుత్వ సేవల వంటి కీలక రంగాల్లో ఇప్పుడు డ్రోన్లు అంతర్భాగంగా మారాయి. ముఖ్యంగా, 'స్వామిత్వ' పథకం కింద దేశంలోని 3.28 లక్షల గ్రామాల్లో డ్రోన్ల ద్వారా సర్వే పూర్తి చేశారు. దీని ద్వారా 31 రాష్ట్రాల్లోని 1.82 లక్షల గ్రామాలకు సంబంధించి 2.76 కోట్ల ఆస్తి కార్డులను సిద్ధం చేశారు. మహిళా సాధికారతకు కూడా డ్రోన్ టెక్నాలజీ ఊతమిస్తోంది. 'నమో డ్రోన్ దీదీ' కార్యక్రమం కింద 500కు పైగా డ్రోన్లతో సహా, మొత్తం 1,094 డ్రోన్లను మహిళా స్వయం సహాయక సంఘాలకు (ఎస్‌హెచ్‌జీ) పంపిణీ చేశారు. భవిష్యత్తులో దేశీయ తయారీ, పైలట్లకు నైపుణ్యాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రభుత్వ మద్దతుతో మానవ రహిత వైమానిక వ్యవస్థల రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా అవతరించడానికి సిద్ధంగా ఉందని అధికారిక ప్రకటన వివరించింది.

## ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టులో చుక్కెదురు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** వైసిపి అధినేత వైఎస్.జగన్ అక్రమస్తుల కేసులో ఐఎఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. జగన్ అక్రమాస్తుల కేసులో తన పేరును తొలగించాలని కోర్టులో దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సమర్థిస్తూ సుప్రీం కోర్టు ఈ పిటిషన్ రిజెక్ట్ చేసింది. ఓబులాపురం గనుల కేసులో నిబంధనలకు అనుగుణంగా వెళ్లానని ఐఎఎస్ శ్రీలక్ష్మి సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. అయితే శ్రీలక్ష్మి నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడ్డారని, ఆమె మరిది భారీగా అక్రమాస్తులు సంపాదించారని ధర్మాసనానికి సిబిఐ వెల్లడించింది. ఆమె లంచం కూడా డిమాండ్ చేసినట్టు సాక్ష్యాలు వాంగ్మూలం ఇచ్చారని సుప్రీం ధర్మాసనానికి సిబిఐ అధికారులు తెలిపారు. విచారణ అనంతరం శ్రీలక్ష్మి దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది.

## ఫ్రాన్స్ సహాయంతో ఎవరెస్టుపైకి వెళ్లగలిగే హెలికాప్టర్‌ను తయారు చేస్తాం: మోడీ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** భారత్- ఫ్రాన్స్ సంబంధాలు ప్రత్యేకమైనవని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారత్-ఫ్రాన్స్ దేశాల మధ్యే కాకుండా, ప్రజల మధ్య కూడా సత్సంబంధాలు ఉన్నాయని తెలిపారు. పరిశ్రమలే కాదు ఆవిష్కరణల్లోనూ ఫ్రాన్స్, భారత్ సహకరించుకుంటాయన్నారు. ఫ్రాన్స్ దశాబ్దాల తరబడి వ్యూహాత్మక భాగస్వామిగా ఉందని గుర్తు చేశారు. ఫ్రాన్స్ సహాయంతో ఎవరెస్టుపైకి వెళ్లగలిగే హెలికాప్టర్ తయారు చేస్తామని, భారత్‌లో తయారయ్యే హెలికాప్టర్లు ప్రపంచమంతా ఎగుమతి అవుతాయన్నారు. క్లీన్ ఎనర్జీ, స్పేస్ వంటి రంగాల్లో భారత్, ఫ్రాన్స్ కలసి పనిచేస్తాయని వెల్లడించారు. ముంబయిలో జరిగిన భారత్- ఫ్రాన్స్ ద్వైపాక్షిక చర్చల్లో భాగంగా ఇరువురు దేశాధినేతలు సమావేశమయ్యారు.

## 'ఐబొమ్మ' రవికి బెయిల్ మంజూరు

**హైదరాబాద్, పతాకం న్యూస్:** సినిమా పైరసీ కేసులో సంచలనం సృష్టించిన 'ఐబొమ్మ' వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమంది రవికి ఎట్టకేలకు ఊరట లభించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అతనికి హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టు మంగళవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గత ఏడాది నవంబర్‌లో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రవిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. దక్షిణ భారత సినిమాలు, ఓటీటీ కంటెంట్‌ను అక్రమంగా అప్‌లోడ్ చేస్తూ సినీ పరిశ్రమకు వేల కోట్ల రూపాయల నష్టం కలిగించాడనే ఆరోపణలతో రవిపై ఐదు కేసులు నమోదయ్యాయి. ఈ కేసులో అరెస్టయిన నాటి నుంచి రవి జైల్లోనే ఉన్నాడు. గతంలో అతని బెయిల్ పిటిషన్లను నాంపల్లి కోర్టు, హైకోర్టు తిరస్కరించాయి. తాజాగా మరోసారి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, కఠిన షరతులతో బెయిల్‌కు అంగీకరించింది.

# శరవేగంగా అరకులోయ- చొంపి మధ్య రైల్వే గేటు వద్ద అండర్ పాస్‌వే పనులు



**అరకు, పతాకం న్యూస్ :** అరకులోయ- చొంపి మధ్య ఉన్న రైల్వే గేటు వద్ద రైల్వే అధికారుల పర్యవేక్షణలో అండర్ పాస్‌వే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అలాగే అండర్ పాస్‌కు ఇటు, అటు అప్రోచ్ రోడ్లు నిర్మిస్తున్నారు. నెల రోజుల పాటు అరకులోయ నుంచి చొంపి వెళ్లే మార్గాన్ని మూసి వేసి పనులు చేపట్టేందుకు కలెక్టర్‌ను రైల్వే ఇంజనీరింగ్ అధికారులు అనుమతి కోరారు. అనుమతి లభించడంతో యుద్ధప్రాతిపదికన రేయింబవళ్లు పనులు చేస్తున్నారు. ఈ అండర్ పాస్‌వే పూర్తయితే అరకులోయ నుంచి చొంపి, సిరగం, మాడగడ, బస్కీ తదితర గ్రామాల ప్రజలకు రైల్వే గేటు కష్టాలు తీరతాయి. ఏ సమయంలోనైనా వాహనదారులు రాకపోకలు సాగించే వీలు ఉంటుంది. రైల్వే అండర్ పాస్‌వే పనులు చేపడుతుండడంపై పలు గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## ఎలమంచిలి స్టేషన్‌కు రూ.13.13 కోట్లతో ఆధునికీకరణ పనులు



**ఎలమంచిలి, పతాకం న్యూస్ :** స్థానిక రైల్వే స్టేషన్ అభివృద్ధి, ఆధునికీకరణ పనులు మరికొద్ది వారాల్లో పూర్తికానున్నాయి. వాస్తవానికి ఏడాది క్రితమే ఈ పనులు పూర్తికావాల్సి వున్నప్పటికీ చాలా కాలం నత్తనడకన సాగాయి. రెండు నెలలు క్రితం దక్షిణ మధ్య రైల్వే విజయవాడ ఏడీఆర్‌ఎం, ఇతర అధికారులు ఈ రైల్వే స్టేషన్‌ను సందర్శించి, ఆధునికీకరణ పనులను పరిశీలించారు. చాలా నెమ్మదిగా జరగడంపై కాంట్రాక్టర్‌ను, కిందిస్థాయి అధికారులను ఆరా తీశారు. ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి పనులన్నీ పూర్తిచేయాలని ఏడీఆర్‌ఎం ఆదేశించారు. దీంతో అప్పటి నుంచి పనులు ఊపందుకొన్నాయి. అమృత్ భారత్ పథకం కింద ఎంపికైన ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు సకల సదుపాయాల కల్పనకు రూ.13.13 కోట్ల అంచనా వ్యయంతో మూడేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. వీటిని ఏడాదిన్నరలో పూర్తిచేయాలన్న లక్ష్యం. ఆరంభంలో పనులు వేగంగానే సాగాయి. తరువాత పూర్తిగా మందగించాయి. విజయవాడ డివిజన్ అధికారులు రెండు నెలల క్రితం పర్యటించి వెళ్లిన తరువాత పనుల్లో వేగం పుంజుకుంది. రైల్వే స్టేషన్ ఆధునికీకరణలో భాగంగా ప్రయాణికులకు పలు రకాల సదుపాయాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రయాణికులు వేచి ఉండేందుకు చేపట్టిన వెయింటింగ్ హాలు నిర్మాణం దాదాపు పూర్తికావచ్చింది. ప్లాట్ ఫారాలపై గ్రానైట్ పలకలు, అవసరమైనచోట యాంటీ స్కిడ్ టైల్స్ వేశారు. రెండు, మూడో ప్లాట్‌ఫారాలపై పలు అభివృద్ధి పనులు చేపట్టారు. రైళ్ల కోసం వేచి వుండే ప్రయాణికులకు ఎండ తగలకుండా, వర్షం కురిస్తే తడిసిపోకుండా వుండేందుకు రేకుల షెడ్లు నిర్మిస్తున్నారు. తాగునీటి సదుపాయం కల్పిస్తున్నారు. స్టేషన్‌కు ఎడమ వైపున కొత్త ఫుట్‌ఓవర్ వంతెన నిర్మించారు. దీనికి అనుసంధానంగా ఒకటి, రెండు/ మూడు ప్లాట్‌ఫారాలకు లిఫ్ట్ సదుపాయం కల్పిస్తున్నారు. రైల్వే స్టేషన్ ప్రవేశ మార్గాన్ని అందంగా తీర్చిదిద్దే పనులు జరుగుతున్నాయి. సువిశాలమైన స్థలంలో వాహనాల పార్కింగ్ సదుపాయం కల్పిస్తున్నారు

## రూ.30 లక్షల నగదు బూడిదపాలు



**విజయనగరం, పతాకం న్యూస్:** విజయనగరం జిల్లా డెంకాడ మండలంలోని గంట్లాము గ్రామంలో రెండు పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ. 30 లక్షల నగదు బూడిదపాలైంది. ఈ సంఘటన రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం... గ్రామానికి చెందిన గుడిమెట్ల చిట్టి రాజు బావమరిది నాగరాజు మల్లపురాజు తాగిన మైకంలో సిగరెటు కాల్చి రాజు ఇంటిపైకి విసిరేశారు. దీంతో రాజు ఇంటితో పాటు పక్కనే ఉన్న మల్లపు రాజు బంగారమ్మ ఇల్లు కూడా కాలిపోయింది. ఇళ్లు కట్టుకుందామని రాజు దాచిన రూ. పదిలక్షల రూపాయలు అగ్నికి ఆహుతైంది. బంగారమ్మ ఇంటిలో ఉన్న రూ. 20 లక్షల రూపాయలు అగ్నికి బూడిదైంది. అలాగే 12 తులాల బంగారం కూడా కాలిపోయిందని బాధితురాలు వాపోయారు. రెవెన్యూ అధికారులు గ్రామాన్ని సందర్శించి ఆస్తి నష్టం అంచనా వేస్తున్నారు.

## సహకార ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

**ముమ్మిడివరం, పతాకం న్యూస్:** సహకార సంఘాల ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారించాలని మండల కో ఆపరేటివ్ సంఘాల జెఎసి డిమాండ్ చేసింది. రాష్ట్ర సహకార సంఘాల ఉద్యోగుల కో ఆపరేటివ్ జెఎసి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా రెండో రోజైన మంగళవారం సొసైటీ అధ్యక్షులకు సమ్మె నోటీసులలో భాగంగా కొమానపల్లి సొసైటీ అధ్యక్షుడు పొద్దొకు నారాయణరావుకు ఉద్యోగులు సమ్మె నోటీసు అందజేసి మద్దతు కోరారు. ముఖ్య కార్యనిర్వహణ అధికారి నంద్యాల మణికంఠ మాట్లాడుతూ ఉద్యోగుల భద్రతకు జిఒ 36 అమలు చేయాలని, 2019-24 వేతన సవరణ బిల్లు అమలు చేయాలని, ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంపు చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు.

## ఆకట్టుకున్న నేవీ రిహార్సల్స్





**విశాఖపట్నం, పతాకం న్యూస్ :** ఐఎఫ్ఆర్‌లోని ప్రధాన వేడుకకు సన్నద్ధంగా విశాఖపట్నం ఆర్‌కె బీచ్‌లో తూర్పు నావికాదళం ఆధ్వర్యాన సాగిన సన్నాహక విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. భారత నౌకాదళం అమ్ములపొదిలో ఉన్న అత్యాధునిక యుద్ధ విమానాలు, హెలికాప్టర్లతో సముద్రంపై చేసిన సాహసాలు దేశ శక్తిసామర్థ్యాలకు అద్దం పట్టాయి. ఐఎన్‌ఎస్ విక్రాంత్, విక్రమాదిత్య నౌకల నుంచి ఆపరేట్ చేసిన మిగ్-29కె యుద్ధ విమానాలు అత్యంత వేగంగా సముద్ర ఉపరితలంపై నుంచి దూసుకువెళ్తూ 'వర్టికల్ చార్లీ' వంటి విన్యాసాలు చేశాయి. సముద్ర గర్భంలోని శత్రు సబ్ మెరైన్లను కనిపెట్టే భారీ నిఘా విమానం బీచ్‌కు అతి సమీపంలో తక్కువ ఎత్తులో ప్రయాణించి అందరినీ అబ్బురపరిచింది. నౌకాదళానికి చెందిన హెలికాప్టర్లు గాలిలో చేసిన ఫీట్లు గగుర్పాటుకు గురిచేశాయి. సముద్రంలో రెస్క్యూ ఆపరేషన్లు, శత్రు నిఘా కోసం వాడే సీ కింగ్ కామోవ్-31 గాలిలో ఒకే చోట స్థిరంగా నిలిచి చేసిన ప్రదర్శన అబ్బురపరిచింది. స్వదేశీ సాంకేతికతతో రూపొందిన అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల విన్యాసాలు కట్టిపడేశాయి. చేతక్ హెలికాప్టర్లు అతిథులపై పూల వర్షం కురిపించాయి. మెరైన్ కమాండోలు హెలికాప్టర్ల నుంచి తాళ్ల సాయంతో అత్యంత వేగంగా కదులుతున్న బోట్ల మీదకు, సముద్రంలోకి దిగి శత్రువుల మీద మెరుపు దాడి ఎలా చేస్తారో కళ్లకు కట్టినట్లు చేసి చూపారు. వేల అడుగుల ఎత్తు నుంచి పారాచూట్ల సాయంతో సముద్రంలోని కచ్చితమైన లక్ష్యాలపైకి దూకడం చూపరులను థ్రిల్‌కు గురిచేసింది. బీచ్ రోడ్డులో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తీరంలో విదేశీ నావికుల కవాతు సాగింది. ఈ నెల 19న జరిగే 'సిటీ పరేడ్'లో మరింత అబ్బురంగా ఈ విన్యాసాలను ప్రదర్శించేందుకు నావికాదళం శ్రమిస్తోంది.

## రణభేరి 2.0 చలో విజయవాడకు యుటిఎఫ్ నేతలు



**అల్లూరి జిల్లా, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు డిమాండ్స్ పరిష్కారానికై మంగళవారం రణభేరి 2.0 లో భాగంగా చలో విజయవాడకు మండల యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు జి శ్రీను,కె శ్రీను ల ఆధ్వర్యంలో యుటిఎఫ్ నాయకులు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు జిశ్రీను,కె శ్రీనులు మాట్లాడుతూ .... 12వ పియర్సి కమిషన్‌ని వెంటనే నియమించాలని, 2.29 శాతం ఐఆర్ వెంటనే ప్రకటించాలని, పెండింగ్ డి.ఎ వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగులు, అలాగే పెన్షనర్ల బకాయిల చెల్లింపులకు రూట్ మ్యాప్ ను ప్రకటించాలని, హెల్త్ కార్డు మెడికల్ బిల్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎస్ రద్దు చేయాలని, మెమో 57 ప్రకారం పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, తదితర సమస్యల పరిష్కారానికై విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే ధర్నాలో పాల్గొనేందుకు రాజవొమ్మంగి మండలం నుండి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలివెళ్లి పాల్గొనడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల కోశాధికారి టీవీ ఎల్ఎన్ మూర్తి. యూటీఎఫ్ నాయకులు కె. రమేష్ బాబు,చెన్నం శెట్టి చిట్టిబాబు, నీలాద్రి రాజుబాబు, మిరియాల రమేష్ బాబు దాసరి పైడిమల్లి, తీగల బజ్జియ్య, లింగేటి గంగరాజు, కె.అప్పలరాజు, వై.రాజకుమార్. కె. లింగారెడ్డి.కె.లోవరాజు,టి.ఎల్ ప్రసన్న.బి.ఎస్ ఆర్ ప్రసాద్. జి. ఝాన్సీ రాణి, టి.వి.వి సత్యనారాయణ.సి హెచ్ రామకృష్ణ. బి. బుజ్జిబాబు.పి. మంగాదేవి.ఎ.చిన్నమ్మాయి, జె.వెంకటలక్ష్మి, పి.రామ కృష్ణ , పలువురు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పద్మనాభస్వామి కళ్యాణోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



**భీమిలి, పతాకం న్యూస్ :** అనంత పద్మనాభ స్వామి వారి వార్షిక తిరు కళ్యాణోత్సవాల పోస్టర్‌ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈనెల 27 వ తేదీ రాత్రి 8 గంటలకు కళ్యాణోత్సవం, మార్చి 1 వ తేదీ సాయంత్రం 6 గంటలకు తెప్పోత్సవం జరుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పీఎల్ఎన్ రాజు తెలిపారు. మార్చి 2 వ తేదీ రాత్రి 9 గంటలకు రథోత్సవం ఉంటుందని, మార్చి4 వ తేదీ రాత్రి 8 గంటలకు జరిగే పుష్పయాగంతో ఉత్సవాలు పూర్తవుతాయని వివరించారు. ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. పద్మనాభం టీడీపీ అధ్యక్షుడు కోరాడ రమణ, పార్టీ నేతలు కసిరెడ్డి దామోదరరావు, కాళ్ల నగేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రూ. 30.74 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన గంటా



**భీమిలి, పతాకం న్యూస్ :** కష్టాల్లో ఉన్నవారికి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న వారికి ఎంవీపీ కాలనీ నివాసంలో సోమవారం సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతం కంటే వేగంగా సీఎం సహాయ నిధి ఆర్థిక సాయం అందేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నారని తెలిపారు. నియోజకవర్గంలో ప్రజలకు ఏ ఆపద వచ్చినా ఆదుకోవడానికి సిద్ధంగా ఉంటామన్నారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలు, 1 నుంచి 8 వార్డులు, 98 వ వార్డుకు చెందిన 29 మందికి రూ. 30.74 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గాడు చిన్ని కుమారి లక్ష్మి, పీవీ నరసింహం, లొడగల అప్పారావు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గంటా నూకరాజు, తాత్రాజు అప్పారావు, కసిరెడ్డి దామోదరరావు, కోరాడ రమణ, మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, గరే గుర్నాథ్, లొడగల జానకిరామ్, పిల్లా వెంకట్రావు, కె. అచ్యుతరావు, గొలగాని నరేంద్ర, గాడు యశ్వంత్, చెట్టిపల్లి సన్యాసిరావు, తమ్మిన సూరిబాబు, దండి వెంకటేష్, జీరు సత్యం, పాసి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

## 186 కిలోల గంజాయి స్వాధీనం



**కొయ్యూరు, పతాకం న్యూస్:** ఒడిశా నుంచి బూదరాళ్ల మీదుగా రాజమహేంద్రవరం, అనపర్తి, తమిళనాడుకు రవాణా చేస్తున్న 186 కిలోల గంజాయిని సోమవారం కొయ్యూరు, మంప పోలీసులు వేర్వేరు ప్రాంతాల్లో స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్టు చేశారు. దీనికి సంబంధించి కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మధ్యాహ్నం 2 గంటల సమయంలో కొయ్యూరు ఎస్ఐ కిశోర్‌వర్మకు అందిన ముందస్తు సమాచారం మేరకు చీడిపాలెం కూడలిలో తన సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించారు. బూదరాళ్ల మీదుగా మినీ వ్యాన్‌లో వస్తూ పోలీసు తనిఖీలను గుర్తించి తిరిగి వెనక్కి వెళ్లిపోయే ప్రయత్నం చేసింది. పోలీసులు చాకచక్యంగా ఆ వ్యాన్‌ను పట్టుకున్నారు. అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వ్యాన్‌ను తనిఖీ చేశారు. వ్యాన్ బాడీ కింద రహస్య అర ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. అందులో 83 ప్యాకెట్లలో 183 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణా చేస్తున్న ఒడిశాకు చెందిన డ్రైవర్ వంతల ప్రసాద్‌తో పాటు తమిళనాడుకు చెందిన శంకర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్టు సీఐ తెలిపారు. అలాగే మంప ఎస్ఐ శ్రీనివాసరావుకు వచ్చిన సమాచారం మేరకు సోమవారం ఉదయం బూదరాళ్ల గ్రామ సరిహద్దుల్లో తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆపగా వారు వాహనాన్ని వదిలి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని పట్టుకుని వారి వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా సుమారు మూడు కిలోల గంజాయి లభించింది. పట్టుబడిన అనపర్తి గ్రామానికి చెందిన జగరపు సాయికుమార్, పులిగ విజయ్‌కుమార్‌లను విచారించగా ధారకొండ అవతల ఒడిశాకు చెందిన గ్రామంలో కొనుగోలు చేశామని వారు తెలపడంతో ఇద్దర్నీ అరెస్టు చేసినట్టు సీఐ చెప్పారు.

## కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి




**విజయనగరం, పతాకం న్యూస్:** జిల్లాలో మొక్కజొన్న, పెసర, మినుము, పంట అమ్ముకొనేదానికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు కోరారు. కలెక్టరేట్‌వద్ద రైతులతో కలసి నిరసన తెలిపారు. అనంతరం పిజిఆర్ఎస్‌లో వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అపరాలను మార్కెట్‌లో మద్దతు ధర కన్నా తక్కువ కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని, క్వింటా వద్ద రైతులు సుమారు రూ.1800, మొక్కజొన్న అమ్మకాల్లో క్వింటా ఇవద్ద 900 నష్టపోతున్నారని అన్నారు. వెంటనే పెసర, మినుము, మొక్కజొన్న పంటను కొనుగోలు చేసేందుకు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలోరైతు సంఘం నాయకులు లోకవరపు ఆదినారాయణమూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు గులిపల్లి గంగునాయుడు, నాయకులు శిరికి శ్రీరామ్మూర్తి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, కోడెల శ్రీను, గంట్యాడ రైతు సంఘం అధ్యక్షులు, కసిరెడ్డి నారాయణరావు, ఎం.ఎర్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రహదారి భద్రత నిబంధనలు పాటించాలి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** రహదారి భద్రత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అలాగే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏఎస్పీ కేవీ రమణ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో తన చాంబర్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఈ రెండు అంశాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. గంజాయి వంటి మత్తు పదా ర్థాలకు అలవాటుపడడం ద్వారా జీవితాలు అంధ కారమవుతాయన్నారు. వారి కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతాయ న్నారు. రహదారి ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అధిక వేగం, మద్యం సేవించి వాహ నాలు నడపడం ద్వారా ప్రమాదాలు జరుగు తున్నాయన్నారు. వీటిని నియంత్రించడంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. రహదారి భద్రత, డ్రగ్స్ నియంత్రణపై అన్ని పాఠశా లలు, కళాశాలలు, పబ్లిక్ ప్రదేశాల్లో పోస్టర్లను అతికించి అవ గాహన కలిగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వి.రామారావు, జిల్లా డీఆర్‌బీ విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ సురేష్, సామాజిక కార్యకర్త వంగ పండు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.1000 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక మౌలిక సదుపాయాలు: లోకేశ్

### (మొదటిపేజీ తరువాయి)

ఇప్పుడు 33 శాతానికి పెంచామని అన్నారు. దీనిద్వారా పిల్లలకు మెరుగైన విద్య అందడంతో పరీక్షల్లో మెరుగైన ఫలితాలు వస్తాయని అన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయా లకు సంబంధించి ప్రధానంగా 5 అంశాలను పరిగణనలోకి తీసుకున్నామని అన్నారు. ప్రధానంగా లీక్ ప్రూఫ్ బిల్డింగ్, పెయింట్స్, బెంచీలు, టాయ్ లెట్స్, తాగునీరు అందించాలని నిర్ణయించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు రేటింగ్ ఇచ్చామని, ఏపీలో 5 స్టార్ రేటింగ్ ఉన్నవి లేవని వెల్లడించారు. 40 శాతం 1, 2లో స్టార్‌లో ఉన్నాయని, అన్ని ప్రభుత్వ పాఠశాలలకు 3, 4 స్టార్ రేటింగ్ కు తేవాలన్నదే ప్రజాప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. పెండింగ్ వర్క్స్ పూర్తిచేయా ల్సిన బాధ్యత తమపై ఉందని అన్నారు. ఎక్కడ తరగతి గదుల అవసరం ఉందో అక్కడ యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని నిర్ణయించామని అన్నారు. ఎస్ఎంసీ ఎకౌంట్ లో రూ.200 కోట్ల నిధులు ఉన్నాయని, బడ్జెట్ లో రూ.800 కోట్లు అదనంగా కేటాయించారని అన్నారు. ఈ రెండు కలిపి వచ్చే ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక మౌలిక సదుపాయాలకు రూ.వెయ్యి కోట్లు ఖర్చుచేసే అవకాశం ఉందని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒక పద్ధతి ప్రకారం 5 స్టార్ రేటింగ్ తెచ్చే బాధ్యత ప్రజాప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. 2014-19 నడుమ చేసిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపునకు చర్యలు చేపడతామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ, గత ప్రభుత్వం పాఠశాలల విషయంలో అస్తవ్యస్థ విధానాలు అవలంభించిందని అన్నారు. నాడు- నేడు పేరుతో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. వాటి కారణంగా నేటికి కూడా అనేక చోట్ల అసంపూర్తి నిర్మాణాలు, మరుగుదొడ్ల నిర్మాణం పూర్తికాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలలో నూతన విద్యావిధానానికి శ్రీకారం చుట్టి, పెద్దఎత్తున ఉపాధ్యాయ పోస్టుల నియామకం చేపట్టినట్లు తెలిపారు.

మనబడి - మన భవిష్యత్ పేరిట పాఠశాలలను ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుతూ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నారని అన్నారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య భారీగా పెరుగుతోందని అన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలు, తరగతి గదులను సత్వరం పూర్తిచేయాల్సిందిగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారని అన్నారు.

2019 ఎన్నికలకు ముందు తిత్లీ తుపానులో ఎన్నో పాఠశాలలు దెబ్బతిన్నాయని గుర్తు చేశారు. నాటి చంద్రబాబు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేసినప్పటికీ, టీడీపీ సానుభూతిపరులు పనులు చేశారనే కారణంతో వైసీపీ ప్రభుత్వం వాటి బిల్లులు చెల్లించలేదని అన్నారు. గత ఐదేళ్లలో నాడు-నేడు అక్రమాలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అసంపూర్తిగా నిలచిపోయిన భవనాలు పూర్తి చేయాలని గౌతు శిరీష విజ్ఞప్తి చేశారు.

# నేడు శ్రీముఖలింగేశ్వరుడి చక్రతీర్థ స్నానం



**శ్రీకాకుళం,, పతాకం న్యూస్:** మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీముఖలింగం వద్ద వంశధారనదిలో బుధవారం శ్రీముఖలింగేశ్వర స్వామి చక్రతీర్థ స్నానం నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలు ధరించి.. పూలమాలలతో అలంకరించి.. మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ నంది వాహనంపై ఊరేగిస్తారు. వంశధార నది మిరియాపల్లి రేవు వద్దకు తీసుకెళ్తారు. అక్కడ చక్రతీర్థ స్నానం చేయిస్తారు. ఈ ఉత్సవంలో లక్షలాది మంది భక్తులు పాల్గొంటారు. ఈమేరకు దేవదాయశాఖ అధికారులు, అర్చకులు ఏర్పాట్లు చేస్తున్నారు. నంది వాహనాన్ని సిద్ధం చేశారు. చక్రతీర్థ స్నానాలకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయిప్రత్యూష అధికారులను ఆదేశించారు. వంశధార నదిలో ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. భక్తుల రద్దీకి తగ్గట్లు నదిలో నీటి ప్రవాహాన్ని పెంచాలని వంశధార డీఈకి సమాచారం ఇవ్వాలని తహసీల్దార్ జె.రామారావుకు సూచించారు. నదిలోకి వచ్చే మార్గంలో నాలుగులైన్ల బారికేడ్లు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అలాగే నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు కూడా ఏర్పాట్లు పరిశీలించి.. ఎస్ఐ అశోక్‌బాబుకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్.ఐ జగదీష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు తర్ర బలరాం, సర్పంచ్ టి.సతీష్‌కుమార్, ఆలయ పాలకమండలి చైర్మన్ శివప్రసాద్ పాడి పాల్గొన్నారు.

## విజయనగరం నగర పాలక సంస్థ నూతన కమిషనర్‌కు సమస్యల సవాల్



**విజయనగరం, పతాకం న్యూస్:** విజయనగరం నగర పాలక సంస్థ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన బాలస్వామికి నగరంలో పలు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. నగరంలో పెరుగుతున్న జనాభా, విస్తీర్ణం , 100 ఏళ్ల నాటి కాలువ వ్యవస్థ, 30 ఏళ్ల నాటి తాగునీటి పథకాలతో నగర పాలక సంస్థ నడుస్తుంది. గత 20 ఏళ్లలో లక్ష నుంచి మూడున్నర లక్షలకు జనాభా పెరిగింది. లక్ష జనాభా ఉన్నపుడు ఉన్న నీటి పథకాలు, నీటి సరఫరా, పారిశుధ్య కార్మికుల సంఖ్య తోనే పాలకులు నెట్టుకొస్తున్నారు. నగరంలో విలీన పంచాయతీలు, పెరుగుతున్న కాలనీల్లో మౌలిక వసతులు లేకపోవడం నగరాన్ని వెక్కిరిస్తున్నాయి. పాలకులు మారినా రోడ్లు, కాలువలు, తాగునీరు వంటి సమస్యలు వెంటాడుతునే ఉన్నాయి. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ బాలస్వామి ముందు ఇవన్నీ సవాల్‌గా నిలిచాయి. పెరిగిన నగరం..పెరగని పారిశుధ్యం నిర్వహణ.నగర పాలక సంస్థలో లక్షన్నర జనాభా ఉన్నపుడు ఉన్న పారిశుధ్య కార్మికులతోనే నేటికీ పారిశుధ్య పనులు నెట్టుకొస్తున్నారు. నగరంలో సుమారుగా రెండు వందల కిలోమీటర్లు పరిధిలో కాలువ వ్యవస్థ ఉంది. జనాభా, పట్టణీకరణ పెరుగుతున్నా, కాలనీల సంఖ్య పెరిగినా అందుకు తగ్గట్టు పారిశుధ్య కార్మికుల సంఖ్యను మంత్రం పాలకులు, అధికారులు పెంచడం లేదు. అధికారిక లెక్కల ప్రకారం కేవలం 70 శాతం చెత్త మాత్రమే రోజు తీసుకెళ్లి డంపింగ్ యార్డుకు చేరవేస్తున్నారు. 30 శాతం రోడ్లపైనే ఉంటోంది. విలీన ప్రాంతాలు, విస్తరించిన కొత్త కాలనీలు కాకుండా పదేళ్ల క్రితం లెక్కలు ఇవి. గత ఐదేళ్ళుగా పరిశీలిస్తే 2005లో 375 మంది పర్మినెంట్లు కార్మికులు, 275 మంది కాంట్రాక్టు కార్మికులు ఉండేవారు. తాజా లెక్కల ప్రకారం 170 మంది పర్మినెంటు కార్మికులు, 470 మంది కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు. జనాభా పెరుగుదలకు తగ్గట్టు కార్మికులను నియమించడం లేదు. దీంతో నగరంలోని శివారు కాలనీల్లో ఎక్కడ చూసినా అపారిశుధ్యమే కనిపిస్తుంది.పాత నీటి పథకాలే దిక్కుజిల్లా కేంద్రమైన విజయనగరంలో 50 ఏళ్ల కిందటి నీటి పథకాలతోనే నెట్టుకొస్తున్నారు. ముషిడిపల్లి, నెల్లిమర్ల ,రామతీర్థం నీటి పథకాలే నేటికీ పెద్ద దిక్కుగా ఉన్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నీటిని సరఫరా చేసే సామర్థ్యం లేకపోవడంతో నేటికీ నగర ప్రజలకు రోజు తప్పించి రోజు ఇస్తున్న నీరందిస్తున్న పరిసక్థతి నెలకొంది. ఈ సమస్యలన్నింటిపై దృష్టి సారించి, పట్టణాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దడంలో కొత్త కమిషనర్ బాలస్వామి తన మార్కును చూపిస్తారో లేదో వేచి చూడాల్సిందే.

## శాసనమండలిలో ఎందుకు డిజిటల్ అటెండెన్స్ వ్యవస్థను అమలు చేయలేదు?: బొత్స



**అమరావతి, పతాకం న్యూస్:** శాసనసభలో డిజిటల్ అటెండెన్స్ వ్యవస్థను అమలు చేసిన ప్రభుత్వం, అదే విధానాన్ని శాసనమండలిలో ఎందుకు అమలు చేయలేదని విపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. మండలి మీడియా పాయింట్ లో మాట్లాడుతూ ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక, దేవదేవుడి ప్రసాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనవసర ఆరోపణలు చేశారని బొత్స ఆరోపించారు. పందికొవ్వు, జంతువుల కొవ్వు కలిపారని ప్రచారం చేయడం బాధాకరమన్నారు. వాస్తవాలు తేలాలని సుప్రీంకోర్టు సిట్ నియమించిందని, దర్యాప్తులో కొన్ని ఆశ్చర్యకర విషయాలు బయటకు వస్తున్నాయని చెప్పారు. ప్రజలు జీర్ణించుకోలేని నిజాలు వెలుగులోకి వస్తున్నాయని వ్యాఖ్యానించారు. కల్తీ నెయ్యి సరఫరా చేస్తున్నారనే కారణంతో ఇందాపూర్ను బ్లాక్ట్ పెట్టారని, ఇప్పుడు అదే సంస్థ రూ.680కు నెయ్యి సరఫరా చేస్తోందని తెలిపారు. ఇందాపూర్ సంస్థకు హెరిటేజ్ ఫుడ్స్ సంబంధం ఉందని, ఇవన్నీ తాము సృష్టించిన ఆరోపణలు కాదని -- సంబంధిత సంస్థలే వెల్లడించాయని అన్నారు. ఇందాపూర్ను అడ్డుపెట్టుకుని హెరిటేజ్ దోపిడీకి ప్లాన్ చేసిందని, దేవుడి పేరుతో రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నం చేశారని ఆరోపించారు. సభలో ఇందాపూర్ అంశంపై చర్చకు ఎందుకు అనుమతించలేదని ప్రశ్నించారు. టాయిలెట్లలో వాడే కెమికల్స్ లడ్డూలో కలిపారని సీఎం మాట్లాడటం దురదృష్టకరమన్నారు. చంద్రబాబు అధికార దాహంతో ఏ స్థాయికైనా వెళ్తారని విమర్శించారు. ఆయన దోపిడీపై ఎంతవరకైనా పోరాడుతామని స్పష్టం చేశారు.

## రోడ్డు నిర్మాణానికి భూములు ఇవ్వలేం



**భోగాపురం, పతాకం న్యూస్:** ఎయిర్‌పోర్టు నిర్మాణంతో ఇప్పటికే పెద్దఎత్తున భూములు కోల్పోయిన తమకు మిగిలిన భూములకూ రక్షణ లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. విశాఖ జిల్లా భీమిలి మండలం అన్నవరం పంచాయతీ పరిధిలోని దిబ్బలపాలెం సమీపంలో రెండు ప్రైవేట్ హోటళ్ల నిర్మాణం జరుగుతోంది. దిబ్బలపాలెం నుంచి ఆ హోటళ్లకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేకపోవడంతో, రోడ్డు నిర్మాణం కోసం దిబ్బలపాలెం రైతుల భూములను ఇవ్వాలని అధికారులు కోరారు . దీనికి రైతులు అప్పట్లోనే నిరాకరించారు. తమ భూముల వెనుక వైపున బంజరు భూములు ఉన్నాయని, అవసరమైతే వాటిలో నుంచి రోడ్డు నిర్మించుకోవచ్చునని తెలిపారు. ఇప్పటికే ఎయిర్‌పోర్టు కోసం చాలావరకు భూములు కోల్పోయామని, ఇక మిగిలిన భూములు ఇవ్వలేమని రైతులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం తహశీల్దార్ ఎం. రమణమ్మతో పాటు రెవెన్యూ సిబ్బంది భూముల పరిశీలనకు వెళ్లారు. తమ భూములు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వబోమని స్పష్టం చేశారు. మేము ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే వచ్చామని . మీ అభిప్రాయాన్ని చెపితే వారికి తెలియజేస్తామని అధికారులు తెలిపారు. .

## ముమ్మరంగా పసుపు సేకరణ



**పాడేరు, పతాకం న్యూస్:** మన్యంలో ప్రస్తుతం ఎక్కడ చూసినా గిరిజన రైతులు తమ భూముల్లోని పసుపును తవ్వి తీస్తున్న దృశ్యాలే కనిపిస్తున్నాయి. వరి, రాగుల కోతలు, కాఫీ పండ్ల సేకరణ పూర్తయిన తర్వాత గిరిజన రైతులు పసుపు సేకరణపై దృష్టి సారిస్తారు. ఏజెన్సీ వ్యాప్తంగా సుమారుగా 25 వేల ఎకరాల్లో గిరిజనులు పసుపును సాగు చేస్తున్నారు. ప్రతి ఏడాది డిసెంబరు నెలాఖరు నుంచి తమ భూముల్లోని పసుపు తవ్వి తీసి ఇళ్లలో కుప్పలుగా పోసి నిల్వ చేస్తారు. భూమిలోంచి పసుపు సేకరణ పూర్తయిన తర్వాత వాటిని పెద్ద పాత్రలు, ఇనుప డ్రమ్ముల్లో పూర్తిగా ఉడకబెడతారు. అలాగే బాగా ఉడికించిన పసుపును ఎటువంటి తేమ లేకుండా పూర్తిగా ఎండేలా ఎండలో ఆరబెడతారు. పూర్తిగా ఎండిన పసుపును వారపు సంతల్లో వర్తకులకు విక్రయిస్తుంటారు. జనవరి నెలాఖరు లేదా ఫిబ్రవరి మొదటి వారంలో క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. కానీ ఈ ఏడాది సీజన్ కాస్త ఆలస్యం కావడంతో ఫిబ్రవరి నెలాఖరు నుంచి ఏజెన్సీ వారపు సంతల్లో పసుపు క్రయవిక్రయాలు మొదలవుతాయి. గతానికి భిన్నంగా ఈ ఏడాది పచ్చి పసుపునకు డిమాండ్ ఏర్పడింది. దీంతో పలువురు వర్తకులు, రైతులు ఉత్పత్తిదారు సంఘాలు సైతం గిరిజన రైతుల వద్ద కిలో రూ.40 చొప్పున పచ్చి పసుపును కొనుగోలు చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో విత్తనాలుగా, కాస్మోటిక్ పదార్థాల్లో వినియోగానికి పచ్చి పసుపును కొనుగోలు చేస్తున్నట్టు వర్తకులు తెలిపారు. అయితే ఇన్నాళ్లు ఎండు పసుపును మాత్రమే విక్రయించే రైతులకు పచ్చి పసుపు అమ్మకాలు కొత్తగా ఉన్నాయి. అయితే తమకున్న అవసరాన్ని బట్టి పలువురు రైతులు పచ్చి పసుపును విక్రస్తున్నారు. ఎక్కువ మంది ఉడికించి ఎండబెట్టి అమ్మడానికే ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు.

## విధులు సక్రమంగా నిర్వర్తించని ఎమ్మెల్యేలను ప్రజలు రీకాల్ చేయాలి: అయ్యన్నపాత్రుడు


**అమరావతి,, పతాకం న్యూస్:** విధులు సక్రమంగా నిర్వర్తించని ఎమ్మెల్యేలను ప్రజలు రీకాల్ చేయాలని ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఆయన చిట్చాట్ నిర్వహించారు. "అసెంబ్లీకి హాజరుకావడం ఎమ్మెల్యేల విధి. కొందరు అసలు సభకే రాకుండా జీతభత్యాలు తీసుకోవటం తగదు. అలాంటి వారికి జీతం కట్ చేయాలి. ఉద్యోగులు కార్యాలయానికి రాకపోతే వారికి జీతాలు కట్ చేసి చర్యలు తీసుకునేందుకు ఉన్న నిబంధన ఎమ్మెల్యేలకు ఎందుకు వర్తించకూడదు? ఈ అంశాలపై జాతీయ స్థాయిలో చర్చ చేపట్టాలి. ఈ నిబంధన దాదాపు 8 దేశాల్లో అమల్లో ఉంది. అసెంబ్లీలో నూతనంగా ప్రవేశపెట్టిన డిజిటల్ అటెండెన్స్ బాగా పని చేస్తోంది. ఎవరు ఎంత సేపు సభలో ఉన్నారనేది కూడా రికార్డు అవుతోంది" అని అయ్యన్నపాత్రుడు అన్నారు.

## గిగ్ వర్కర్లను కేంద్రం పట్టించుకోవడం లేదు: రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** గిగ్ వర్కర్ల (డెలివరీ బాయ్స్, క్యాబ్ డ్రైవర్లు)ను పట్టించుకోడవంలో కేంద్రం విఫలమైందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. గిగ్ వర్కర్ల ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన తీవ్రస్థాయిలో స్పందించారు. కేంద్రం, వివిధ రాష్ట్రాల్లోని బీజేపీ ప్రభుత్వాలు వారికి జరుగుతున్న అన్యాయాన్ని చూసీచూడనట్లు వదిలేస్తున్నాయని మండిపడ్డారు. గిగ్ వర్కర్ల కోసం బలమైన చట్టాలు లేవని, వారికి సామాజిక భద్రత లేదని, గిగ్ కంపెనీలకు ఎటువంటి జవాబుదారీతనం లేదని ఆయన దుయ్యబట్టారు. ఈ మేరకు రాహుల్ గాంధీ తన ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. అయితే ఆయన కొన్నిరోజుల క్రిత 'జన్ సంసద్'లో గిగ్ వర్కర్ల ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు. ఆ వీడియోను తాగా పోస్టు చేశారు. ఈ సందర్భంగా ఫేస్‌బుక్ వేదికగా కేంద్రం విమర్శలు గుప్పించారు. గిగ్ వర్కర్లకు స్థిరమైన ఆదాయం లేదని, వారికి కనీస వైద్య సౌకర్యాలు లేదా ఇన్సూరెన్స్ వంటి సామాజిక భద్రత కల్పించడంలో కంపెనీలు విఫలమవుతున్నాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. ముఖంగా మహిళా గిగ్ వర్కర్లు మరింత దోపిడీకి గురవుతున్నారన్నారు. వారికి ఆర్థిక భద్రతతో పాటు కనీస గౌరవం, రక్షణ కూడా కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రంగంలో పనిచేసే వారిలో మెజారిటీ కార్మికులు దళిత, గిరిజన వర్గాలకు చెందినవారే అని, అందుకే ఈ వ్యవస్థలో కుల వివక్ష, అణచివేత వంటి రుగ్మతలు స్పష్టంగా కనిపిస్తున్నాయని రాహుల్ వివరించారు.

## బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



**కడప, పతాకం న్యూస్:** కేంద్రీయ విద్యాలయ బస్సులు కొనసాగించాలని తల్లిదండ్రులు కోరారు. కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జెసికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్న సమయంలో ఆర్‌టిసి అధికారులు వారం రోజులు పాటు కెసి బస్సులు ఆపివేయటం సరైంది కాదన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు వ్యయప్రయాసాలకు గురవుతారని పేర్కొన్నారు. 700 మందికి పైగా విద్యార్థులు బస్‌పాస్‌లు తీసుకున్నారని, అందులో 300 మంది విద్యార్థులు ఒక్కొక్కరూ సంవత్సరానికి రూ.3,400 చెల్లించి స్టూడెంట్స్ కన్సెసెక్షన్ పాస్‌లు తీసుకున్నారని తెలిపారు. అలాంటప్పుడు బస్‌లు ఎలా ఆపేస్తారని తల్లిదండ్రులు ప్రశ్నించారు. ఎక్కువ మంది ఇతర ప్రాంతాలలో పనులు చేసుకుంటున్నారని, విద్యా హక్కు చట్టం కింద 25 శాతం మంది పేద విద్యార్థుల ఇక్కడ చదువుకుంటున్నారని చెప్పారు. కె.వి. పట్టణానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉందని చెప్పారు. ఆటోలకు వెళ్లిరావటం ఆర్థిక భారం అవుతుందని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయం లేక విద్యార్థులు స్కూలు కు వెళ్లలేకపోతున్నారని తెలిపారు. ఆపివేసిన బస్సులను మంగళ వారం నుంచి కొనసాగించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాధవి క్యాంప్ కార్యాలయంలో కార్యదర్శికి, ఆర్‌టిసి కడప డిపో మేనేజర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కె.వి. పేరెంట్స్ అసోసియేషన్ ట్రెజరర్ జితేంద్ర, ఉపాధ్యక్షులు మల్లికార్జునరెడ్డి, సంయుక్త కార్యదర్శి శాంసన్ అనిల్, రూట్ 6 అధ్యక్షులు నారాయణ, మహిళా విభాగం కన్వీనర్ పద్మ కళా, కమిటీ సభ్యులు జయలక్ష్మి, మహిమ, లేఖ, మధుసూధన్, రవీంద్ర రెడ్డి, రాజేష్, ఆనంద్, నజీర్ పాల్గొన్నారు.

## రెవెన్యూ క్లినిక్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



**పార్వతీపురం, పతాకం న్యూస్:** రెవెన్యూ క్లినిక్ ద్వారా అందిన వినతులను తక్షణమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తహశీల్దార్లను ఆదేశించారు. సోమవారం ఆయన ఛాంబరులో రెవెన్యూ క్లినిక్ అంశాలు, వివిధ రెవెన్యూ పనుల పురోగతిపై తహశీల్దార్లతో జెసి సమీక్షించారు. రెవెన్యూ క్లినిక్ ద్వారా అందిన దరఖాస్తులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకొని సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అన్నారు. భూరికార్డుల్లో దొర్లిన తప్పుల సవరణ, మ్యూటేషన్ దరఖాస్తులను గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో జరుగుతున్న భూరీసర్వే ప్రక్రియ, హద్దుల నిర్ణయం, సబ్-డివిజన్ పనులపై తహశీల్దార్ల నుంచి వివరాలు సేకరించారు. ఎక్కడైనా జాప్యం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. నిర్దేశించిన గడువులోగా రెవెన్యూ పనుల్లో పురోగతి చూపని పక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లాలోని తహశీల్దార్లు పాల్గొన్నారు.మ్యూటేషన్లపై స్పష్టమైన మార్గదర్శకాలుభూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత పెంచేందుకు, రైతుల ఇబ్బందులను తొలగించేందుకు మ్యూటేషన్ ప్రక్రియలో ఎటువంటి తప్పులు దొర్లకుండా ఉండేందుకు జెసి యశ్వంత్ కుమార్ రెడ్డి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. మ్యూటేషన్లో, రికార్డుల్లో దొర్లిన తప్పులను ఎలా సవరణ చేయాలో విఆర్‌ఒలకు, ఆర్‌ఎస్డిటీలకు వివరించారు. రెవెన్యూ రికార్డుల్లో పేరు, విస్తీర్ణంలో మార్పులు, చేర్పులు, సర్వే నంబర్ల నమోదుపై ప్రజల నుంచి వస్తున్న విన్నపాలను దృష్టిలో ఉంచుకుని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. మ్యూటేషన్ల జారీలో ఉండే సందేహాలను నివృత్తి చేసుకోవాలని, తప్పులను సరిదిద్దుకోవాలని సూచించారు. సమావేశంలో డిఆర్‌ఒ కె.హేమలత, విఆర్‌ఒలు, ఆర్‌ఎస్డిటీలు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ కొత్త రైల్వే జోన్‌కు వేగంగా అడుగులు ?

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలు ఫలితాల నిస్తున్నాయి. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా జోన్ కార్యకలాపాలకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఏప్రిల్ 1 నుంచి నూతన రైల్వే జోన్ పట్టాలెక్కే సంకేతాలు కన్పిస్తున్నాయి. దీంతో దక్షిణ మధ్య రైల్వే 3 డివిజన్లకే పరిమితం కానుంది. దక్షిణమధ్య రైల్వే పునర్విభజన ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. కొత్త రైల్వే జోన్‌కు అపాయింటెడ్ డేను కేంద్ర ప్రభుత్వం తొందరలోనే ప్రకటించనున్నట్టు తెలిపింది. ఏప్రిల్ 1 నుంచి నూతన రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభింపజేయాలని రైల్వేశాఖ భావిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వర్గాలకు సంకేతాలు అందినట్లు తెలుస్తోంది. ఇది అమల్లోకి వస్తే 6 డివిజన్లతో సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే జోన్ సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్‌లకే పరిమితం కానుంది. మిగతా విజయవాడ, గుంటూరు, గుంతకల్లుతో పాటు తూర్పు కోస్తా జోన్‌లోని కొంతభాగంతో కలిపి కొత్తగా ఏర్పడే విశాఖపట్నం డివిజన్‌తో కలిపి దక్షిణ కోస్తా జోన్ ఏర్పాటుకానుంది. కొత్త జోన్‌కు ఏప్రిల్ 1 అపాయింటెడ్ డే. దీనికి ఇంకా 6 వారాలే సమయం ఉంది. కొత్త జోన్ ప్రారంభానికి ఇంత తక్కువ సమయం సాంకేతికంగా సరిపోతుందా అన్న కోణంలోనూ రైల్వే బోర్డులో చర్చ జరిగినట్లు తెలిసింది. సాధ్యాసాధ్యాలపై కొద్దిరోజుల్లోనే స్పష్టత వస్తుందని నెలాఖరుకల్లా కొత్త జోన్ అపాయింటెడ్ డేపై నోటిఫికేషన్ రావచ్చంటూ దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయం అధికారులు అంటున్నారు. డివిజన్ల వారీగా విభజన, సరిహద్దుల్లో మార్పులు చేర్పులు, ఆదాయ వ్యయాలు, రైళ్ల నిర్వహణ సహా పలు అంశాలతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక రైల్వేబోర్డుకు 9 నెలల క్రితమే చేరింది. ఏపీ విభజన చట్టంలో విశాఖ కేంద్రంగా కొత్తగా




రైల్వే జోన్ ఏర్పాటు చేయనున్నట్లు అప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చింది. నూతన జోన్‌కు కేంద్ర మంత్రి వర్గం 2025 ఫిబ్రవరిలో ఆమోదం తెలిపింది. కొన్ని నెలల నుంచే కొత్త జోన్ జీఎం, విభాగాధిపతులను బోర్డు దశల వారీగా నియమిస్తోంది. నూతన జోన్ ఏర్పాటుతో ఇప్పటి వరకు ఉన్న డివిజన్లలో కొన్ని మార్పులు, చేర్పులు జరగనున్నాయి. గుంతకల్లు డివిజన్‌లో ఉన్న రాయచూరు-వాడి 108 కిలోమీటర్ల సెక్షన్ సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌కు పరిమితం కానుంది. విష్ణుపురం-పగిడిపల్లి, విష్ణుపురం-జాన్‌పహాడ్ 142 కిలోమీటర్ల మార్గాలు ప్రస్తుతం గుంటూరు డివిజన్‌లో ఉండగా అవి సికింద్రాబాద్‌కు బదిలీ కానున్నాయి.

46 కిలోమీటర్ల మోటుమర్రి-కొండపల్లి మార్గం సికింద్రాబాద్ నుంచి విజయవాడ డివిజన్ పరిధిలోకి వెళ్లనుంది. ఇదిలా ఉండగా మరోవైపు సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ప్రధాన కార్యాలయానికి 54 ఎకరాలు కేటాయించారు. పరిపాలన భవనానికి ఖర్చు రూ.192 కోట్లుగా అంచనా. ఈ నిర్మాణంలో దాదాపు 12 అంతస్తులు ఉండనున్నాయి. దీని విస్తీర్ణం లక్ష చదరపు అడుగులుగా ఉంది.

# పల్లెవాసులకు ఆధునిక సాంకేతిక సేవలు





**విశాఖపట్నం, పతాకం న్యూస్:** గ్రామీణ భారతంలో డిజిటల్ అంతరాన్ని తగ్గించి, ఆ స్థానంలో ఆధునిక సాంకేతిక సేవలను పల్లెవాసులకు మరింత చేరువ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగా టెలికమ్యూనికేషన్ విభాగం(ఐఆ) ప్రయోగాత్మకంగా సమృద్ధి గ్రామ్ ఫిజిటల్ సర్వీసెస్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంది. దీంతో విద్య, వ్యవసాయం, ఈ-గవర్నెన్స్, ఆరోగ్య సంరక్షణ తదితర సేవలను (కొన్ని ఉచితంగా, మరికొన్ని నామమాత్రపు ఫీజుతో) గ్రామాలకు చేరువ చేయడానికి చర్యలు తీసుకుంటుంది. ఈ కార్యక్రమంలో భాగంగా తొలివిడతగా దేశంలోని 3 గ్రామాలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. అందులో రాష్ట్రానికి చెందిన గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం నారాకోడూరు ఒకటిగా ఉంది. ఇక్కడ సమృద్ధి కేంద్రం ఏర్పాటుకు కార్పస్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో డీవోటి ఒప్పందం కుదుర్చుకుంది. మిగిలిన 2 ప్రయోగాత్మక గ్రామాలైన ఉత్తర్‌ప్రదేశ్‌లోని చౌరావాలాలో ఐ-నోవేట్ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, మధ్యప్రదేశ్‌లోని ఆరి-ఉమ్రీలో డిజిటల్ ఎంపవర్‌మెంట్ ఫౌండేషన్‌లతో డీవోటీ ఒప్పందాలు కుదుర్చుకుంది. గత సంవత్సరం అక్టోబర్‌లో సంతకాలూ పూర్తయ్యాయి. అప్పటినుంచి నారాకోడూరులో 3 సార్లు గ్రామసభలు నిర్వహించారు. అక్కడి పనులను సైతం ముమ్మరం చేశారు. అయితే ఈ పల్లెను ఎంపిక చేయడానికి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ సమృద్ధి కేంద్రాన్ని ఈ నెల 22న కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని సమృద్ధి కేంద్రం నోడల్ అధికారి, గుంటూరు జడ్పీ సీఈవో జ్యోతిబసు తెలిపారు. గుంటూరు జిల్లా నారాకోడూరులోని సచివాలయ భవన సముదాయంలో ఈ సమృద్ధి కేంద్రం ఏర్పాటైంది. ఇక్కడ హెల్త్ ఏటీఎం ఏర్పాటు చేశారు. ఈ ఏటీఎం ద్వారా 60 రకాల పరీక్షలు నిర్వహించేందుకు అవకాశం ఉంది. అంతేగాక ఆన్‌లైన్ ద్వారా వైద్యులకు ఆ వివరాలు చేరవేయడానికి, వారి నుంచి సలహాలు, సూచనలు పొందే సౌకర్యమూ ఇందులో కల్పించారు. ఈ కేంద్రంలో స్కిల్ ల్యాబ్?ను సైతం ఏర్పాటు చేశారు. ఇక్కడ విద్యార్థులు వీఆర్, ఏఆర్ టెక్నాలజీ సాయంతో 3డీ కింద అవసరమైన వైజ్ఞానిక, సమాచారం అంశాలను తెలుసుకునే విధంగా ఏర్పాట్లు చేశారు.

వ్యవసాయ రంగానికి సంబంధించి డ్రోన్ టెక్నాలజీతో రైతులు తమ పొలాలకు పురుగుమందులు పిచికారీ చేసుకోవడానికి వీలుగా ఒక విభాగం పెట్టారు. అదేవిధంగా ఈజీ మార్ట్‌లో స్థానికులు, రైతులు తమ ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయించుకోవడానికి ఇంకో విభాగాన్ని ఏర్పాటు చేశారు. అలాగే గ్రామంలోని ప్రతి ఇంట్లో ఉన్న వారి టీవీని కంప్యూటర్‌గా మార్చుకోవడమేగాక ఇంటర్‌నెట్ వినియోగించుకునేందుకు కూడా ప్రత్యేక బాక్సులనూ ఏర్పాటు చేశారు.

# మనుగడ కోల్పోయిన పట్టు పరిశ్రమ

**చింతపల్లి, పతాకం న్యూస్:** చింతపల్లిలో 50 ఏళ్ల క్రితం పట్టు పరిశ్రమను ఏర్పాటు చేశారు. ఇందుకోసం 25 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. గతంలో పట్టు పరిశ్రమ అధికారులు మల్బరీ, ఎరీ, టస్సార్, మూగ పట్టు పురుగులు పెంచేవారు. 20 ఏళ్ల క్రితం చింతపల్లిలో మల్బరీ పట్టు గూళ్ల నుంచి పట్టుదారం సేకరించేవారు. కాలక్రమంగా పట్టుదారం సేకరించే యూనిట్‌ని ఎత్తివేశారు. ఆరేళ్ల క్రితం వరకు మల్బరీ, ఎరీ, టస్సార్ పట్టు గూళ్లను ఉత్పత్తి చేసి మార్కెట్ చేసేవారు. కేవలం అసొంలో మాత్రమే పెరిగే మూగ పట్టు చింతపల్లిలో ఉత్పత్తి చేసేందుకు అనుకూలమని అధికారులు గుర్తించడంతో చింతపల్లిలో మూగ పట్టు ఉత్పత్తిని ప్రారంభించారు. మూగ ఉత్పత్తికి సోమ్, సోల్ చెట్లు ఉండాలి. మూగ పట్టు పురుగులు చెట్లలోనే పెరిగి, అక్కడే గూళ్లు కట్టుకుంటాయి. దీంతో మూగ పట్టు ఉత్పత్తి కోసం మండల కేంద్రం అంతర్ల వద్దనున్న 16.5 ఎకరాల్లో ఆరు ఎకరాల్లో సోమ్, సోల్ మొక్కలను పెంచారు. పట్టుపరిశ్రమకు చెందిన 16.5 ఎకరాల్లో 4.5ఎకరాలు ఏరియా ఆస్పత్రి నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించింది. దీంతో ఏరియా ఆసత్రి నిర్మించే ప్రాంతంలోనున్న సోమ్, సోల్ మొక్కలు తొలగించారు. ప్రస్తుతం రెండు ఎకరాల్లో మాత్రమే సోమ్, సోల్ మొక్కలు ఉన్నాయి. చింతపల్లిలో పట్టు ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. గతంలో ప్రతి ఏడాది లక్షల సంఖ్యలో పట్టుగూళ్ల ఉత్పత్తిని చేసేవారు. ఆరేళ్ల క్రితం వరకు ఇక్కడ నాలుగు మల్బరీ, ఎరి, టస్సార్, మూగ పట్టును సాగు చేసేవారు. గత వైసీపీ ప్రభుత్వం నుంచి పట్టు ఉత్పత్తికి సరైన సహకారం లేకపోవడం, నిధుల కొరత కారణంగా పట్టు సాగును నిలిపివేశారు. పట్టు పరిశ్రమకు ఉద్యోగుల కొరత వెంటాడుతుంది. గతంలో



పట్టుపరిశ్రమలో సెరీకల్చర్ అధికారి, టెక్నికల్ అధికారులు ఇద్దరు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఇద్దరు, ముగ్గురు అటెండర్లు ఉండేవారు. సుమారు 20మంది వరకు కార్మికులు ఉండేవారు. కాలక్రమంగా కార్మికులను పూర్తిగా తొలగించారు. ప్రస్తుతం పట్టుపరిశ్రమ పరిధిలో ఒక్క కార్మికుడు లేరు. ప్రస్తుతం టెక్నికల్ అధికారి, ఫీల్డ్ అసిస్టెంట్ మాత్రమే విధుల్లో ఉన్నారు.

పట్టు పరిశ్రమలో మొక్కుబడిగా అతి తక్కువ పరిమాణంలో టస్సార్, మూగ సాగు చేపడుతున్నారు. గతంలో మల్బరీ, టస్సార్, మూగ పట్టుని భారీ మొత్తంలో సాగు చేసేవారు. గత ఏడాది ఆగస్టు నుంచి నవంబరులో 200 టస్సారు పురుగులు పెంచగా ఐదు వేల గూళ్లు ఉత్పత్తి చేశారు. అలాగే 150 మూగ పురుగులను సాగు చేయగా 2,500 గూళ్లను ఉత్పత్తి చేశారు. మూగ గూళ్లను గౌహతి పంపించారు. అక్కడ రైతులు ఈగూళ్లను సీడ్‌గా ఉపయోగించుకున్నారు.

పట్టు పరిశ్రమలో 40 ఏళ్ల క్రితం కార్యాలయం, ల్యాబ్, గోదాము, వర్మికంపోస్టు ఉత్పత్తి షెడ్ నిర్మించారు. ఈ భవనాల నిర్వహణ, మరమ్మతులపై గత ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో పట్టుపరిశ్రమ కార్యాలయం, గోదాము, ల్యాబ్ పూర్తిగా శిథిలమైపోయాయి. వినియోగంలో లేకపోవడంతో భవనాలు కూలిపోయే దశకు చేరుకున్నాయి. పట్టుపరిశ్రమకు చెందిన భూములు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం ఈభూమిలో ఎటువంటి సాగు జరగడంలేదు. ఈ భూములపై ఎటువంటి పర్యవేక్షణ లేకపోవడంతో కొంత స్థలం ఆక్రమణకు గురైంది. అంతర్ల వద్ద నున్న సోమ్, సోల్ మొక్కలు కలిగిన భూములు మందుబాబులకు అడ్డాగా మారింది. పట్టు పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకొనిరావాలని ప్రాంతీయులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మార్చి 24న ప్రజా వ్యతిరేక చట్టాలకు నిరసనగా ఢిల్లీలో ధర్నా




**హైదరాబాద్, పతాకం న్యూస్:** కేంద్రం ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో మార్చి 24న ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ తెలిపారు. అమెరికాతో ఇటీవల మోడీ సర్కారు చేసుకున్న స్వేచ్ఛా ఒప్పందం దేశ సమగ్రతకు ప్రమాదమని హెచ్చరించారు. దీని ప్రభావం వ్యవసాయ రంగానికే పరిమితం కాకుండా అన్ని రంగాలపైనా, జిడిపిపైనా పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై సంయక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న పోరాటాలను ప్రస్తావించారు. హైదరాబాద్‌లోని సిపిఎం రాష్ట్ర కార్యాలయం ఎంబి భవన్‌లో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఏ దేశం నుంచి ఇండియా చమురును దిగుమతి చేసుకోవాలనే విషయాన్ని ట్రంప్ నిర్ణయించడమేంటి..? అలాగైతే ప్రధాని మోడీ, చమురు మంత్రి ఎందుకు అని ప్రశ్నించారు. నరేగా పేరును విబి గ్రామ్ జీగా మార్చడం, వంద రోజుల పనిని 125 రోజులకు పెంచుతామని మోడీ సర్కారు ప్రచారం చేయడం పెద్ద మోసం అని విమర్శించారు. గ్రామీణ పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడాలనే ఉద్దేశంతో వామపక్షాలు చేసిన పోరాటాలు, 60 మంది లెఫ్ట్ పార్టీల ఎంపిల ఒత్తిడితో యుపిఎ-1 ప్రభుత్వ హయాంలో నరేగా చట్టం రూపుదాల్చిందని వివరించారు. లేబర్ కోడ్‌లను అమలు చేయబోమని కేరళలోని వామపక్ష ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. సర్ పేరుతో పెద్ద ఎత్తున ఓట్లను తొలగించడాన్ని తప్పుబట్టారు. కేరళ స్థానిక ఎన్నికల్లో లెఫ్ట్ ఫ్రంట్‌కు కాస్త సీట్లు తగ్గినప్పటికీ ఓటింగ్ శాతం పెరిగిందని తెలిపారు. అయితే, దీనికి భిన్నమైన పరిస్థితి అసెంబ్లీ ఎన్నికల్లో ఉంటుందనీ, మళ్లీ లెఫ్ట్ ఫ్రంట్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేరళ కమ్యూనిస్టుల పాలనను ఓ సదస్సులో కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ కొనియాడారని గుర్తుచేశారు. పినరయి విజయన్ ప్రభుత్వంలో మత విద్వేషాలకు అవకాశం లేని శాంతియుత వాతావరణంలో కేరళ ప్రజలు నివసిస్తున్నారని ఓ ఇంటర్నేషనల్ సెమినార్‌లో అమర్త్యసేన్ చెప్పిన విషయాన్ని బేబీ ప్రస్తావించారు.

## సమస్యలపై విఆర్ఒల ఆందోళనలు



**ఏలేశ్వరం, పతాకం న్యూస్:** పని భారం తగ్గించాలని విఆర్‌ఒలు పలుచోట్ల ధర్నాలు చేశారు. తహశీల్దారు కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టారు. సమస్యలు పరిష్కరించాలని నినదించారు.ప్రజాశక్తి-యంత్రాంగంఏలేశ్వరం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్‌ఒలు, విఆర్‌ఎలు, సర్వేయర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా విఆర్‌ఒల సంఘం గౌరవాధ్యక్షుడు అవసరాల కిషోర్ మాట్లాడుతూ తమకు పని భారం తగ్గించాలని అమరావతి జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు నేడు రేపు ఎల్లుండి నిరసనలు చేపడతామన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనను మరింత ఉధతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సత్య రావు, కార్యదర్శి రొంగల శ్రీనివాస్ పాల్గొన్నారు.గొల్లప్రోలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్‌ఒలు ధర్నా చేపట్టారు. నాయకులు శేఖర్ బాబ్జి మాట్లాడారు. డి.చంటిబాబు కె.గోవిందరాజులు, బి.నారాయణరావు పాల్గొన్నారు.కరప తహశీల్దార్ కార్యాలయాల వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. దడాల భరణి కుమార్‌తో, ఎం.సత్య కిషోర్, శ్రీను ఏసేబు, వెంకటరమణ పాల్గొన్నారు.కోటనందూరు తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. కె.సూర్యనారాయణ, వి.సూరిబాబు, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

## అట్టహాసంగా దూడల ప్రదర్శన

**ఆలమూరు (కోనసీమ), పతాకం న్యూస్:** మండలంలోని నవాబుపేటలో పశు సంవర్ధక శాఖవారు, ఏపీఎల్డిఏ వారి సహకారంతో నవాబుపేట, మోదుకూరు, నర్సిపూడిలలో పాడి రైతులకు చెందిన 40 పెయ్యి దూడలతో అట్టహాసంగా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వెటర్నరీ ఏడి డాక్టర్ ఎల్.అనిత విచ్చేసి పరిశీలించి, పర్యవేక్షించారు. ఇందులో అందమైన పెయ్యి దూడల ఎంపిక కోసం పెనికేరు పశు వైద్యాధికారి డాక్టర్ జి.భాను ప్రసాద్, పేరవరం పశువైద్యాధికారి రవితేజ, ఏపీఎల్డిఏ పశువైద్యాధికారి డాక్టర్ కళ్యాణి జడ్జ్ లుగా వ్యవహరించారు. పాడి రైతులు తీసుకొని వచ్చిన దూడలను పశు వైద్యాధికారులు పరీక్షించి వాటికి మార్కులు వేసి మొదటి మూడు అందాల దూడలకు ఎంపిక చేసి, విజేతలను ప్రకటించి, వారికి బహుమతులు అందజేశారు.

## అగ్ని బాధితులకు అండగా యుటిఎఫ్



**కోనసీమ, పతాకం న్యూస్:** ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు యుటిఎఫ్ మండల శాఖ అండగా నిలిచింది. బాధితులకు వంట పాత్రలు, బట్టలను ఎంఇఒలు శ్రీనివాసరావు, వెంకన్నబాబు చేతుల మీదుగా అందచేశారు. ఒక్కో కుటుంబానికి ఆరు రకాల వంట సామాన్లు, బట్టలు, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్ర మంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటివి. సుబ్బారావు, జిల్లా కోశాధికారి సిహెచ్.కేశవరావు, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.నాగేంద్రప్రసాద్, ఎంఎన్.వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు కె.సత్యనారాయణ, రాష్ట్ర కౌన్సిలర్ అరుణజ్యోతి, టిఆర్‌కె.గణపతి, ఎం.సత్యనా రాయణ, కెవి. సూర్యచంద్రరావు, హైస్కూల్ హెచ్‌ఎం చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు. బాధితులందరికీ ఒకే చోట ఇళ్ల పట్టాలుఆల్ క్యాస్ట్ కాలనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఒకేచోట ఇళ్ల స్థలాలు ఇస్తామని ఎంపి గంటి హరీష్‌మాధూర్ హామీ ఇచ్చారు. సోమవారం వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ముక్కరమ్ హుస్సేన్ సమకూర్చిన నిత్యావసర సరుకుల కిట్లను బాధిత కుటుంబాలకు ఎంపి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో సర్వము కోల్పోవడం దురదృష్టకరమన్నారు. బాధితులను ఆదుకునేందుకు, ఒకేచోట ఇళ్ల స్థలాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.

## దంతాల పట్ల జాగ్రత్త వహించాలి

**తూర్పు గోదావరి, పతాకం న్యూస్:** : పిన్నలు, పెద్దలు తమ దంతాల పట్ల జాగ్రత్త వహించాలని ప్రముఖ రత్నాస్ దంత వైద్యులు డాక్టర్ మేడపాటి మురళీ జోగి రెడ్డి, డాక్టర్ మేడపాటి శాలిని రెడ్డి అన్నారు. మార్టేరులోని ఖండవల్లి కిషోర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక వివేకానంద స్కూల్‌లో పెనుగొండ రత్నాస్ డెంటల్ హస్పటల్ వారిచే మెగా మెడికల్ డెంటల్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్‌ను ఆలమూరు ఉప సర్పంచి కొవ్వూరి సత్తిరెడ్డి ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 600 మంది విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ టెక్నాలజీతో పనిచేసే డెంటల్ రోబోట్ సహాయంతో డిజిటల్ స్కానింగ్ చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఖండవల్లి కిషోర్ చారిటబుల్ ట్రస్ట్ సెక్రటరీ గుడిమెట్ల లక్ష్మణ్ రెడ్డి, ట్రెజరర్ సత్యనారాయణ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మురళీ శ్రీనివాసరెడ్డి, వివేకానంద స్కూల్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వెన్ను నొప్పితో బాధపడుతున్నారా..?

వెన్ను నొప్పితో బాధపడుతున్నారా.. అయితే గుమ్మడి గింజలను రోజూ తినండి.. మారిన మన జీవనశైలి కారణంగా మనలో చాలా మంది వెన్నునొప్పితో బాధపడుతున్నారు. ఎక్కువ సమయం కూర్చొని పని చేయడం, ట్రాఫిక్ లో ఎక్కువ సమయం వేచి ఉండడం, సరైన వ్యాయామం చేయకపోవడం వంటి వివిధ కారణాల వల్ల మనలో చాలా మంది వెన్ను నొప్పితో బాధపడుతున్నారు. మారిన మన జీవనశైలి కారణంగా మనలో చాలా మంది వెన్నునొప్పితో బాధపడుతున్నారు. ఎక్కువ సమయం కూర్చొని పని చేయడం, ట్రాఫిక్ లో ఎక్కువ సమయం వేచి ఉండడం, సరైన వ్యాయామం చేయకపోవడం వంటి వివిధ కారణాల వల్ల మనలో చాలా మంది వెన్నునొప్పితో బాధపడుతున్నారు. వయసుతో సంబంధం లేకుండా అందరూ ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య కారణంగా చాలా మంది బలహీనంగా తయారవుతు న్నారు. వెన్నునొప్పి సమస్యకు వైద్య చికిత్స అవసరమే అయినప్పటికీ కొన్నిసార్లు సరైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా కూడా మనం ఈ సమస్య నుండి బయటపడవచ్చు. వెన్నునొప్పితో బాధపడే వారు ఆహారంలో గుమ్మడి గింజలను చేర్చు కోవడం ద్వారా ఈ సమస్య నుండి బయటప డవచ్చని వైద్యులు చెబుతున్నారు. వెన్నునొప్పిని తగ్గించడంలో గుమ్మడి గింజలు ప్రభావ వంతంగా పని చేస్తాయని వీటిని తీసుకోవడం వల్ల వెన్నునొప్పి సమస్య నుండి సులభంగా బయటపడవచ్చని వారు తెలియజేస్తున్నారు. వెన్నునొప్పిని తగ్గించడంలో గుమ్మడి గింజలు ఏ విధంగా మనకు సహాయపడతాయో ఇప్పుడు తెలుసుకుందాం.



గుమ్మడి గింజలల్లో మెగ్నీషియం ఎక్కువగా ఉంటుంది. కండరాలు, నరాలను శాంతపరిచే స్వభావం కలిగి ఉంటుందని మెగ్నీషియంను రిలాక్సేషన్ మినరల్ అని కూడా పిలుస్తారు. గుమ్మడి గింజలను తీసుకోవడం వల్ల మనకు తగినంత మెగ్నీషియం లభిస్తుంది. దీంతో కండరాల ఉద్రిక్తత తగ్గి నడుము దిగువ భాగంలో అసౌకర్యం తగ్గుతుంది. అలాగే దీర్ఘ కాలిక వాపు కూడా నడుము నొప్పిని కలిగిస్తుంది.

గుమ్మడిగింజల్లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో మంటను, వాపును తగ్గించడంలో మనకు సహాయపడతాయి. వాపు తగ్గడం వల్ల నొప్పి, అసౌకర్యం వంటివి కూడా తగ్గుతాయి. గుమ్మడి గింజలు ఒమెగా 3 ఫ్యాటీ ఆమ్లాలను కలిగి ఉంటాయి. ఈ ఆమ్లాలు వాటి శోథ నిరోధక లక్షణాలకు ప్రసిద్ధి చెందాయి. ఈ కొవ్వులు కీళ్లను దృఢంగా చేయడంతో పాటు వాపు, నొప్పి వంటి సమస్యలను కూడా తగ్గిస్తాయి. కనుక నడుము నొప్పితో బాధపడే వారు ఈ గింజలను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. గుమ్మడి గింజల్లో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల మొత్తం ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. కణజాలం కూడా బలంగా తయారవుతుంది. ఇక కండరాలు బలంగా తయారవ్వడానికి, కండరాల మరమ్మత్తుకు ప్రోటీన్ చాలా ముఖ్యమైంది. గుమ్మడి గింజలు మొక్క ఆధారిత ప్రోటీన్ ను మనకు అందిస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల వెన్నెముక బలంగా తయారవ్వడంతో పాటు కండరాల మరమ్మత్తు కూడా సక్రమంగా జరుగుతుంది. కొన్నిసార్లు ఇన్ఫెక్షన్ లు కూడా వెన్నునొప్పికి కారణమవుతాయి. గుమ్మడి గింజల్లో జింక్ అధికంగా ఉంటుంది. వీటిని తినడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. దీంతో ఇన్ఫెక్షన్ లు మన దరి చేరకుండా ఉంటాయి.

ఈ విధంగా గుమ్మడి గింజలు వెన్ను నొప్పిని తగ్గించడంలో మనకు ఎంతో సహాయపడతాయని వైద్యులు చెబుతున్నారు. వీటిని రోజూ గుప్పెడు మోతాదులో తీసుకోవడం వల్ల వెన్నునొప్పి తగ్గడంతో పాటు మొత్తం ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. వీటిని నేరుగా పచ్చిగా తీసుకోవచ్చు. అలాగే పెరుగు, ఓట్ మీల్, సలాడ్ వంటి వాటిపై చల్లుకుని తీసుకోవచ్చు.

# గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం..

## 19 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ




**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/ కళాశాలలు నాణ్యమైన బోధనకు, అత్యుత్తమ శిక్షణకు, క్రమశిక్షణకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నాయి. రానున్న విద్యాసంవత్సరంలో (2026-27) ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లకు సంబంధిత అధికారులు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు మిగులు సీట్లను కూడా భర్తీ చేయనున్నారు. వీటికి సంబంధించి మార్చి 1, 2 తేదీల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 19వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. జిల్లాలో దుప్పలవలస, కొల్లివలస, కంచిలిలో బాలురు గురుకుల పాఠశాల/ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ఎంపీసీ, బైపీసీ కోర్సులు ఉన్నాయి. బాలికలకు సంబంధించి ఎచ్చెర్ల, పెద్దపాడు, నందిగాం, మందస, పాతపట్నం పాఠశాల/ కళాశాలలు ఉన్నాయి. నందిగాంలో ఎంఈసీ, సీఈసీ గ్రూపులు ఉండగా, మిగిలిన అన్ని కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు ఉన్నాయి. ఒక్కో గ్రూపులో 40 చొప్పున సీట్లు ఉన్నాయి. తామరాపల్లిలో కేవలం ఇంటర్మీడియట్ తరగతులను మాత్రమే నిర్వహిస్తారు. అలాగే ఒక్కో పాఠశాలలో ఐదో తరగతిలో 80 సీట్లు చొప్పున ఉన్నాయి.

జిల్లాలోని ప్రతి గురుకుల పాఠశాల/ కళాశాలలో ప్రవేశ పరీక్ష జరుగుతుంది. మార్చి 1న ఉదయం 9.30 నుంచి 11 గంటలకు ఐదో తరగతిలో ప్రవేశానికి, అదేరోజు మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల మధ్య ఇంటర్‌లో ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తారు. ఎంపిక చేసిన కళాశాలల్లో ఐఐటీ, నీట్‌లో శిక్షణ పొందేందుకు వీలుగా మార్చి 1న మధ్యాహ్నం 3 నుంచి 4.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. విద్యార్థులు దరఖాస్తులో ఇచ్చిన ఆప్షన్, ప్రవేశ పరీక్షల్లో వచ్చిన మార్కులు, రిజర్వేషన్లను పరిశీలించి సీట్లు కేటాయిస్తారు. ప్రభుత్వ పాఠశాల లేదా గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదో తరగతి చదివి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇంటర్ ప్ర?థమ సంవత్సరంలో సీటు ఇస్తారు. ఇంటర్‌లో చేరేందుకు 31-8-2026 నాటికి 17 ఏళ్లు మించరాదు. అలాగే ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్నవారు మాత్రమే అర్హులు.

ఐదో తరగతిలో ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 1-9-2013 నుంచి 31-8-2017 సంవత్సరాల మధ్య జన్మించిన వారై ఉండాలి. ఓసీ, బీసీ, కన్వర్టెడ్ క్రిస్టియన్ పిల్లలు 1-9-2015 నుంచి 31-8-2017 లోగా జన్మించి ఉండాలి. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.5 లక్షలకు మించకూడదు.

అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో 6,7 తరగతుల్లో ఖాళీల భర్తీకి వచ్చే నెల 2న ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. 8,9,10 తరగతుల్లో సీట్ల భర్తీకి అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుంది.

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సీటు సాధిస్తే ఎన్నో ప్రత్యేకతలతో విద్యను అభ్యసించవచ్చు. ఇంగ్లిష్ మీడియంలో బోధన, నాణ్యమైన శిక్షణతో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తారు. సంస్కృతి, నైతిక విలువలు పెంపొందించేలా తర్ఫీదునిస్తారు. వ్యక్తిత్వ వికాసం, క్షేత్ర పర్యటనల ద్వారా విద్యార్థుల్లో నూతనోత్తేజం, పర్యావరణం పరిరక్షణపై అవగాహన కల్పిస్తారు. క్రమం తప్పకుండా వ్యాయామంలో శిక్షణ ఇస్తారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం కలిగేలా కరాటే శిక్షణ, వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, గీతాలాపన, చిత్రలేఖనం, సాంఘిక నాటకాలు, శాస్త్రీయ నృత్యాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. అధునాతన శాస్త్ర సాంకేతిక పరిశోధనల దిశగా ప్రోత్సాహిస్తారు. ఇంటర్మీడియట్‌తోనే సరిపెట్టకుండా నీట్, జేఈఈ, ఏపీఈఏపీ సెట్‌లకు నిష్ణాతులైన అధ్యాపకులతో శిక్షణ, నవీన సాంకేతికతను వినియోగించి డిజిటల్ బోధన, వర్చువల్ క్లాస్‌రూమ్స్, కంప్యూటర్ బోధన ఇస్తారు. ఐదో తరగతి విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే మెరుగైన బోధన అందిస్తారు. ఉచిత భోజన, వసతి కల్పిస్తారు. యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఉచితంగా అందజేస్తారు. వ్యాయామానికి అవసరమైన ట్రాక్‌సూట్, బూట్లు, ఉచితంగా ట్రంకు పెట్టె, స్టీలుప్లేటు, గ్లాసు, బెడ్డింగ్, పాదరక్షలు, కాస్మెటిక్స్ అందజేస్తారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




**కడప, పతాకం న్యూస్:** మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎపిమున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నగర అధ్యక్షులు సుంకర రవి మాట్లాడుతూ 12వ పిఆర్‌సి ప్రస్తావన రాష్ట్ర బడ్జెట్లో లేకపోవడం దారుణమన్నారు. మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ (సిఐటియు)పిలుపులో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 12వ పిఆర్‌సి ప్రకటించలేదని తెలిపారు. పిఆర్‌సి ప్రకారం మున్సిపల్ కార్మికులకు జీతాలు పెంచాలని, సంక్షేమ పథకాలు జీవోలు ఇవ్వాలని, కోవిడ్ కార్మికులను, ఆప్కాస్‌లో తీసుకోవాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికులకు 12వ పిఆర్‌సి అమలు చేయకపోతే ఈనెల 24 చలో విజయవాడ కార్యక్రమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు నాగరాజు, సుంకర కిరణ్, రమేష్, పుల్లయ్య, సుబ్బయ్య, రమాదేవి, ఆరోగ్యమ్మ, కార్మికుల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాజంపేట : 12వ పిఆర్‌సి ప్రకారం మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలని మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ డిమాండ్ చేశారు. సిఐటియు రాజంపేట పురపాలక సంఘం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం మునిసిపల్ కమిషనర్ లక్ష్మీనారాయణకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులు డి.లక్ష్మీదేవి, ఎం.వి.రమణ, పట్టణ అధ్యక్షులు కె.ప్రసాద్, జి.పెంచలయ్య, కోవిడ్ కార్మికుల నాయకులు ఎం.రమేష్ బాబు పాల్గొన్నారు.




# సూపర్-8లోకి శ్రీలంక




టీ20 వరల్డ్‌కప్‌లో ఆతిథ్య శ్రీలంక హ్యాట్రిక్ విజయాలతో సూపర్-8లోకి ప్రవేశించింది. గ్రూప్ 'బి'లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ షోతో ఆకట్టుకున్న శ్రీలంక 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఓపెనర్ పతుమ్ నిస్సాంక (52 బంతుల్లో 10 ఫోర్లు, 5 సిక్సర్లతో 100 నాటౌట్) ద్వారా తాజా టోర్నీలో తొలి శతకం నమోదైంది. ఈ గెలుపుతో లంక ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా.. ఆసీస్ మూడు మ్యాచ్‌ల్లో రెండు పాయింట్లతో తమ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. ఎందుకంటే జింబాబ్వే మరో మ్యాచ్ గెలిస్తే చాలు ఆసీస్ ఇంటిముఖం పడుతుంది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 20 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు హెడ్ (29 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 56)తో పాటు టోర్నీలో తొలి మ్యాచ్ ఆడిన కెప్టెన్ మార్ష్ (27 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 54) తుఫాన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. వీరి జోరుకు ఓ దశలో 8.2 ఓవర్‌లోనే స్కోరు 104కు చేరింది. ఈ స్థితిలో జట్టు స్కోరు 220 ఖాయమనిపించింది. కానీ ఆ తర్వాత లంక బౌలర్లు కట్టడి చేయగా ఆసీస్ తడబడింది. ఇన్‌గ్లీస(27), మ్యాక్స్‌వెల్ (22) మాత్రమే ఫర్వాలేదనిపించారు. హేమంతకు మూడు, చమీరకు రెండు వికెట్లు దక్కాయి. భారీ ఛేదనలో శ్రీలంక 18 ఓవర్లలో 184/2 స్కోరుతో గెలిచింది. టీ20 వరల్డ్‌కప్‌ల్లో ఈ జట్టుకిదే అత్యధిక ఛేదన. నిస్సాంక, కుశాల్ మెండిస్ (51) ఆసీస్ బౌలర్లను సునాయాసంగా ఎదుర్కొంటూ రెండో వికెట్‌కు 97 పరుగులు జత చేశారు. ఆ తర్వాత రత్నాయకే (28 నాటౌట్) అండతో మూడో వికెట్‌కు నిస్సాంక 34 బంతుల్లోనే 79 పరుగుల అజేయ భాగస్వామ్యం నమోదు చేసి మ్యాచ్‌ను ముగించాడు. స్టొయినిస్‌కు రెండు వికెట్లు దక్కగా.. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిస్సాంక నిలిచాడు.

# టీ20 ప్రపంచ కప్‌లో..

# ఆస్ట్రేలియా కథ ముగిసినట్లేనా?




ఐదు సార్లు టీ20 ప్రపంచ కప్ విజేత.. క్రికెట్‌లోనే బలమైన జట్టుగా గుర్తింపు.. టోర్నీ ఏదైనా, ఫార్మాట్ ఏదైనా.. ఆ జట్టుతో పోరు అంటే కాస్త జాగ్రత్తగా ఆడాలన్నట్లు ఉండే ప్రత్యర్థులు.. నిలబడి సెంచరీలు బాదే బ్యాటర్లు.. బంతితో ప్రత్యర్థి బ్యాటర్లను బెంబేలెత్తించే బౌలర్లు.. ఇప్పటికే అర్థమై ఉంటుందిగా.. అదే ఆస్ట్రేలియా జట్టు. ప్రస్తుతం జరుగుతున్న టీ20 ప్రపంచ కప్‌లో మాత్రం తీవ్రంగా విఫలమై.. గ్రూప్ స్టేజిలోనే నిష్క్రమించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

టోర్నీలో భాగంగా ఇప్పటికే మూడు మ్యాచ్‌లు ఆడేసింది ఆస్ట్రేలియా. ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 67 పరుగులతో విజయం సాధించింది. దాని తర్వాత పసికూన జింబాబ్వే చేతిలో చిత్తు.. సోమవారం శ్రీలంకపై ఘోర పరాజయాన్ని చవి చూసింది. టైటిల్ ఫేవరెట్లలో ఒకటైన ఆసీస్.. ఇప్పుడు కనీసం సూపర్ 8లో అడుగు పెట్టడమూ కష్టంగా మారింది. తన చివరి పోరులో ఒమన్‌తో ఫిబ్రవరి 20న తలపడనుంది. అందులో గెలిచినా.. సూపర్ 8కి అర్హత సాధిస్తుందనే నమ్మకం లేదు.

మరోవైపు జింబాబ్వే ఇప్పటికే రెండు విజయాలు సాధించి రేసులో ముందుంది. ఆఖరి రెండు మ్యాచుల్లో ఒక్క విజయం నమోదు చేసినా జింబాబ్వే తదుపరి దశకు చేరుకుంటుంది. అయితే జింబాబ్వే.. ఐర్లాండ్‌తో నేడు తలపడాల్సి ఉండగా వర్షం కారణంగా ఆట ఆలస్యమైంది. ఒకవేళ మ్యాచ్ రద్దు అయితే ఇరు జట్లకు చెరొక పాయింట్ లభిస్తుంది. దీని బట్టి చూస్తే జింబాబ్వే సూపర్ 8కి చేరడం ఖాయం. దీంతో ఆసీస్ టోర్నీ నుంచి నిష్క్రమించాల్సిందే.

ఇప్పటికే భారత్, శ్రీలంక, సౌతాఫ్రికా, ఇంగ్లండ్, వెస్టిండీస్, న్యూజిలాండ్ జట్లు సూపర్ 8కి చేరుకున్నాయి. గ్రూప్ ఏలో యూఎస్ఏ-పాకిస్థాన్ జట్లు రెండో స్థానం కోసం పోటీ పడుతున్నాయి. బుధవారం నమీబియాపై గెలిస్తే పాక్ అర్హత సాధిస్తుంది. లేదా యూఎస్ఏ సూపర్ 8కి చేరుకుంటుంది. తాజా పరిణామంతో జింబాబ్వే సూపర్ 8కి క్వాలిఫై అవ్వడం ఖాయం అనిపిస్తోంది. ఒకవేళ ఆస్ట్రేలియా రెండో స్థానాన్ని దక్కించుకోవాలంటే.. ఐర్లాండ్, శ్రీలంకతో జరిగే మ్యాచుల్లో జింబాబ్వే ఓడిపోవాలి. ఒమన్‌పై ఆసీస్ మంచి నెట్ రన్ రేట్‌తో గెలవాలి. ఇవన్నీ సాధ్యం కాదు కాబట్టి.. ఆసీస్ ఈ టీ20 ప్రపంచ కప్ టోర్నీ నుంచి గ్రూప్ స్టేజిలోనే నిష్క్రమించనుందని విశ్లేషకుల అభిప్రాయం.




# సినిమాల్లోకి ఖుష్బూ కూతురు అవంతిక

ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతున్న సినిమా షూటింగ్

ఒకప్పటి స్టార్ హీరోయిన్, బీజేపీ నేత ఖుష్బూ సుందర్ కుమార్తె అవంతిక సుందర్ వెండితెర అరంగేట్రానికి సిద్ధమయ్యారు. ఆమె మలయాళ చిత్ర పరిశ్రమ ద్వారా హీరోయిన్‌గా పరిచయం కాబోతున్నారు. ఆమె నటిస్తున్న తొలి చిత్రానికి 'ఆరంభం' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఇటీవలే త్రిశూర్‌లోని చావక్కాడ్‌లో ఈ సినిమా పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సుమారు 35 ఏళ్ల క్రితం 1991లో ఖుష్బూ సైతం మోహన్ లాల్ సరసన 'అంకుల్ బన్' అనే మలయాళ చిత్రంతోనే ఆ పరిశ్రమలో అడుగుపెట్టారు. ఇప్పుడు ఆమె కూతురు అవంతిక కూడా తల్లి బాటలోనే నడవడం విశేషం. ఈ కొత్త చిత్రంలో అవంతిక 'ఆరతి' అనే పాత్రలో కనిపించనున్నారు.

సుజేష్ అన్నీ ఈపెన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని స్టూడియో బెల్లారూహ్ పతాకంపై నిర్మిస్తున్నారు. ఇందులో ఇంద్రన్స్, విజయరాఘవన్, అల్తాఫ్ సలీం, కళాభవన్ షాజోన్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను మలయాళంతో పాటు తమిళంలోనూ విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.

గోపీ సుందర్ సంగీతం, అజయ్ విన్సెంట్ ఛాయాగ్రహణం అందిస్తుండగా, రాజు సుందరం కొరియోగ్రఫీ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ కున్నంకుళం, చావక్కాడ్ పరిసర ప్రాంతాల్లో వేగంగా జరుగుతోంది.



# త్వరలో విశ్వంభర ట్రైలర్ విడుదల




సీనియర్ నటుడు చిరంజీవి నటించిన సినిమా 'విశ్వంభర'. ఈ సినిమా ట్రైలర్ త్వరలో విడుదల కానున్నట్లుగా చిత్ర యూనిట్ ప్రకటించింది. బింబిసార ఫేం మల్లిడి వశిష్ఠ దర్శకత్వంలో సోషియో ఫాంటసీ చిత్రంగా ఈ సినిమా తెరకెక్కింది. కథానాయిక త్రిష కీలకపాత్రలో నటిస్తున్నారు. అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్, రమ్య పసుపులేటి, సురభి, ఈషా చావ్లా, ఆశ్రిత వేముగంటి నండూరి ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంక్రాంతికి 'మనశంకర వరప్రసాద్ గారు' సినిమాతో విజయాన్ని చిరంజీవి అందుకున్నారు. తాజాగా నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని 'విశ్వంభర' ట్రైలర్ గురించి ఆసక్తికర ప్రకటన చేశారు. ట్రైలర్ సిద్ధమైందనీ, విజువల్స్ తనకు స్టన్నింగ్‌గా అనిపించాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు ప్రేక్షకులు చూసిన దాని కంటే పూర్తి భిన్నంగా ట్రైలర్, సినిమా ఉండబోతుందని వివరించారు. టీజర్‌పై ట్రోల్స్ రావడంతో మేకర్స్ ప్రస్తుతం సీజీ పోర్షన్లపై రీ వర్క్ చేస్తున్నట్టుగా సమాచారం. ఈ

చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ లుక్, కాన్సెప్ట్ వీడియోలు బాగా ట్రెండింగ్‌లో ఉన్నాయి.






# ప్రేమలో బంధాలు బలహీనపడ్డాయి: మృణాల్ ఠాకూర్



ప్రస్తుత ఆధునిక యుగంలో ప్రేమ సంబంధాలు ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాల్ 'కమ్యూనికేషన్' అని ప్రముఖ నటి మృణాల్ ఠాకూర్ అన్నారు. తన రాబోయే చిత్రం 'దో దీవానే షెహర్ మే' ప్రమోషన్లలో భాగంగా మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అంతర్జాలం, సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చాక అంతులేని అవకాశాల వల్ల సంబంధాలలో అలసట పెరిగిపోయిందని, దీనివల్ల ప్రేమ బంధాలు కూడా పెళుసుబారిపోయాయని ఆమె అభిప్రాయపడ్డారు. ఒక నటిగా తన వృత్తి జీవితంలోని సవాళ్ల గురించి కూడా మృణాల్ పంచుకున్నారు. "కొన్నిసార్లు మేము పోషించే పాత్రల కోసం ప్రతికూల మానసిక స్థితిలో ఉండాల్సి వస్తుంది. ఆ ప్రభావం మనకు తెలియకుండానే మన భాగస్వామి, కుటుంబ సభ్యులు లేదా స్నేహితులపై పడొచ్చు. అందుకే, ఒక నటిగా నేను నా పాత్రలను ఇంటికి తీసుకురాకుండా ఉండేందుకు ఎప్పుడూ ప్రయత్నిస్తాను. ఇది అంత సులభం కాదు" అని ఆమె వివరించారు. ఈ సందర్భంగా పాతతరం ప్రేమకథల్లోని మాధుర్యాన్ని ఆమె గుర్తుచేసుకున్నారు. "ఒకసారి నేను అభిమన్యు దసాని తల్లి, ప్రముఖ నటి భాగ్యశ్రీ గారితో సమయం గడుపుతున్నప్పుడు ఆమె తన ప్రేమకథ గురించి చెప్పారు. వారంలో ఒకే ఒక్క ఫోన్ కాల్ కోసం ఆమె పీసీఓ వద్ద ఎదురుచూసేవారట. సిగ్నల్ లేని చోట ఆ ఒక్క కాల్ కోసం పడిగాపులు కాసేవారట. ఆ రోజుల్లో ఒకరి సమయానికి, మాటకు ఎంతో విలువ ఉండేది. కానీ ఇప్పుడు కమ్యూనికేట్ చేయడానికి ఎన్నో మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. దీనివల్ల ఆనాటి నిరాడంబరమైన ప్రేమలో ఉన్న స్వచ్ఛత, విలువ తగ్గిపోయాయి. ఆ పాత రోజుల్లోని ప్రేమే బాగుండేది" అని మృణాల్ అన్నారు. ఇక 'దో దీవానే షెహర్ మే' చిత్ర విషయానికొస్తే, ఇందులో సిద్ధాంత్ చతుర్వేది, సందీపా ధర్, అయేషా రజా కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**